J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 37 17.02.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# ఇదేం బాదుడు.. ఇదేం ఖర్మ?

## తలపట్టుకుంటున్న తెలుగు తమ్ముళ్ళు

## పార్టీశ్రేణుల 'బాధ'యాత్రగా చినబాబు పాదయాత్ర

### ఈ యువగళం.. పార్టీకి ప్లస్సా..? మైనస్సా..?? అన్న మీమాంసలో పార్టీ వర్గాలు



రాష్ట్రంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై దండెత్తి "బాదుడే బాదుడు" – "ఇదేం ఖర్మ" అనే కార్యక్రమాలను రూపొందించుకుని ప్రజల మధ్య తిరిగిన నారా బాబుకి, ఆయన కుమారుడు చినబాబుకి ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యిందంటున్నారు విశ్లేషకులు. 400రోజులపాటు 4000 కిలోమీటర్ల పాదయాత్ర చేయడానికి బయలుదేరిన లోకేష్‌కి సొంత జిల్లా చిత్తూరులోనే జనాదరణ కరువవడం, ముఖ్యంగా జిల్లా కేంద్రం చిత్తూరు నగరంలో ఆయన పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ కావడం రాజకీయ వర్గాలలో పెద్ద చర్చనీయాంశమయ్యింది. మరోవైపు పాదయాత్ర కోసం తమ జేబుల తుప్పు వదలగొడుతున్నారని కూడా తెలుగుతమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారని విశ్వసనీయ సమాచారం. లోకేష్ పాదయాత్ర పార్టీకి ప్లస్సా? మైనస్సా?? అన్న మీమాంస కూడా పార్టీ వర్గాలలో వినపడుతోందంటున్నారు విశ్లేషకులు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ రెండు ఉద్యమాలను చేపట్టింది. "బాదుడే బాదుడు" మొదటిది కాగా, "ఇదేం ఖర్మ" రెండవది. ఇప్పుడు ఆ రెండు స్లోగన్లు తండ్రి కొడుకులకు వ్యతిరేకంగా

10లో








## ఎన్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

# క్రీడల పోటీలు

ఇందుకూరుపేట మండలంలోని నర్సాపురం జిల్లా పరిషత్ హైస్కూలులో ఈనెల 12న నియోజకవర్గం స్థాయిలో పాఠశాలల విద్యార్థులకు గ్రిగ్స్ పోటీలు నిర్వహించారు. దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, వైకాపా నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి సారథ్యంలో జరిగిన ఈ పోటీల్లో నియోజకవర్గంలోని అనేకపాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, శారీరక దారుఢ్యానికి, మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో ఉప యోగపడతాయని ఈ సందర్భంగా కల్యాణ్‌రెడ్డి అన్నారు. కోవూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణారెడ్డి జ్యోతిప్రజ్వలన చేయగా, నిర్వాహకులు బెలూన్లు ఎగురవేసి క్రీడల పోటీలు ప్రారంభించారు. మండల కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మెన్ మావులూరు శ్రీనివా సులురెడ్డి, జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ జయలక్ష్మి, వైకాపా నాయకులు వెంకటశేషయ్య, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పల్లవి, ముజీర్, ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐల బదిలీ

జిల్లాలో ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఇటీవల జిల్లా ఎస్పీ విజయారావు ఉత్తర్వులిచ్చారు. కావలి రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న వీరేంద్రబాబును జలదంకి పోలీస్‌స్టేషన్‌కు, విఆర్‌లో ఉన్న ఎస్ఐ ప్రభాకర్‌ను ఉదయగిరికి బదిలీ చేశారు.

## సమస్యలు తీర్చాలంటూ..

# డిఇఓకు వినతి




ఉపాధ్యాయుల సమస్యలను, జిల్లా విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న కొత్త డిఇఓ గంగా భవానికి ఏపిటిఎఫ్ నాయకులు వెంకటే శ్వరరావు, మోహన్‌దాస్, హజరత్తయ్య, సురేంద్ర, ఖాదర్‌బాషా, సుభాన్ తదితరులు వినతిపత్రం సమర్పించారు. సమస్యలు తీర్చేందుకు తనవంతు కృషిచేస్తానని డిఇఓ వారికి హామీ ఇచ్చారు.

## కావలి మునిసిపాలిటీకి ప్రత్యేకాధికారిగా..

# ఆర్డీఓ శీనానాయక్

కావలి మునిసిపాలిటీకి ప్రత్యేక అధికారిగా కావలి ఆర్డీఓ శీనానాయక్ ఈనెల 13న బాధ్యతలు స్వీకరించారు. కావలి మునిసిపల్ కమిషనర్ శివారెడ్డి దీర్ఘకాలిక సెలవులో వెళ్ళిన నేపథ్యంలో ఆ స్థానంలో శీనానాయక్ నియమితు లయ్యారు.



# శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

## భక్తకన్నప్ప కొండపై ధ్వజారోహణ

దక్షిణ కైలాసంగా పేరొందిన ప్రసిద్ధ శైవక్షేత్రం.. తిరుపతిజిల్లా శ్రీకాళహస్తిలో కొలువైవున్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఈనెల 13న అంకురార్పణ జరిగింది. ఆలయం సమీపంలోని భక్తకొన్నప్ప కొండపై ధ్వజారోహణం నిర్వహించి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధానంగా ఈనెల 18న మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. 19న రథోత్సవం, 20న స్వామి-అమ్మవార్ల కల్యాణోత్సవం, 22న కొండచుట్టూ కైలాసగిరి ప్రదక్షిణ, 23న పల్లకిసేవ, 25న ఏకాంతసేవలు నయనానందకరంగా జరుగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగానే కాక పలు రాష్ట్రాల నుంచి కూడా శ్రీకాళహస్తికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ప్రాంతీయ సంయుక్త కమిషనర్, ఇఓ సాగర్‌బాబు పర్యవేక్షణలో బ్రహ్మోత్సవ వేడుకలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి.

# సత్యమ్మతల్లికి... వేడుకగా పాలపొంగళ్ళు



కలువాయి మండలంలోని తోపుగుంట గ్రామంలో కొలువైవున్న గ్రామదేవత శ్రీ సత్యమ్మతల్లికి ఈనెల 12న గ్రామస్తులు పాలపొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలంతా పాడిపంటలతో, సుఖసంతోషాలతో జీవించా లంటూ అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమను అత్యద్భుతంగా పూలతో తయారుచేసి అలంకరించారు. గ్రామస్తులు దాదాపు 270 మంది కుటుంబాలవారు సంప్రదాయబద్ధంగా గంపలను అలంక రించి అమ్మవారికి పసుపు కుంకుమ, సారె, పొంగలి సామగ్రితో పెద్దఎత్తున మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వచ్చారు. గ్రామస్తులతో పాటు దూరప్రాం తాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారికి పొంగళ్ల నైవేద్యంగా పెట్టి మొక్కుకున్నారు. మరోవైపు లక్షలాది రూపాయల వ్యయంతో సత్యమ్మతల్లి ఆలయం నిర్మాణం పనులు జరుగుతున్న నేపథ్యంలో, అమ్మవారి ఆలయ నిర్మాణంలో దాతలు భాగస్వాములు కావాలని ఆలయ నిర్వాహకులు ఈ సందర్భంగా కోరారు. ఆలయ కమిటీ సభ్యులు.. కలువాయి జడ్పీటీసీ బులగాకుల అనిల్‌కుమార్‌రెడ్డి, తోపుగుంట ఎంపీటీసి ప్రసాద్ నాయుడు, గ్రామసర్పంచ్ నిఖిల్ చౌదరి, గంగాధర్ చౌదరి, బాబునాయుడు, మాదాల రమేష్, జి.మధు, గ్రామపెద్దలు, పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించు కున్నారు. అనంతరం భక్తులందరికీ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ గావించారు.

# 'అవ్వారు'కు ప్రతిభా పురస్కారం




నెల్లూరుకు చెందిన కవి అవ్వారు శ్రీధర్‌బాబు ఇటీవల గుంటూరులో రావి రంగారావు సాహిత్యపీఠం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో 'జనరంజక కవి' పురస్కారాన్ని అందుకు న్నారు. ఆయన ఇటీవల రచించిన 'ఎగురుతున్న పద్యం' కవితాసంపుటికి ఈ అవార్డు లభించింది. నిర్వాహకులు గుత్తికొండ సుబ్బారావు తదితరులు ఈ సందర్భంగా అవ్వారును ఘనంగా సన్మానించారు.


# ప్రభుత్వోద్యోగుల నగరశాఖకు కొత్త కార్యవర్గం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపిజిఇఏ) నెల్లూరు నగరశాఖకు ఈనెల 12న కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక జెట్టి శేషారెడ్డిభవన్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో నగరశాఖ అధ్యక్షునిగా పి.సతీష్‌బాబు, కార్యదర్శిగా ఎస్.నాగరాజు ఎన్నిక య్యారు. సహాధ్యక్షులుగా ఎం.కనకాద్రి, కార్యనిర్వాహక కార్యదర్శిగా వి.శైలేంద్రకుమార్, కోశాధికారిగా పి.నారాయణతో పాటు ఉపాధ్యక్షులను, సంయుక్త కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బి.సుధాకర్‌రెడ్డి వ్యవహరించారు. కొత్తకార్యవర్గ నాయకులను ఏపిజిఇఏ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులురెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.రమణారెడ్డి, వై.మల్లికార్జున అభినందించారు.

# భక్తిరస స్ఫోరకం.. శ్రీసాయి సూక్తి శతకము

తెలుగు సాహిత్యంలో శతకం అత్యంత ప్రజాదరణ పొందిన ప్రక్రియ. కావ్యాలో, ప్రబంధాలో చదవని వారుంటారేమో గాని, శతక పద్యం ఒక్కటీ నోటికి రానివారు తెలుగు ప్రజల్లో ఎవరూ ఉండరు. ఎంత నిరక్షరాస్యుడైనా సుమతీ శతక పద్యమో, వేమన పద్యమో, లేక వాటిలోని సూక్తులో నిత్యం సంభాషణల్లో వాడుతూనే ఉంటారు. అంతలా తెలుగువారి గుండెల్లో 'శతకం' పాతుకుపోయింది.

తెలుగు ఉపాధ్యాయులుగా బహుకాలం ఉన్నత పాఠశాలల్లో పనిచేసిన విద్వాన్ తోట రమణమూర్తి శతక సాహిత్యం మీద మక్కువ పెంచుకున్నారు. చిన్ననాటనే తల్లి దండ్రుల నుంచి దైవభక్తి అలవడింది. సతీమణి ద్వారా సాయి మాస్టర్ భరద్వాజ 'సాయి లీలామృతం' అందింది. సాయి సత్సంగాలకు క్రమం తప్పకుండా వెళ్లడం అలవాట య్యింది. వీటన్నిటికీ తోడు కుటుం బంతో సహా షిర్డీ దర్శించడం, అక్కడ దివ్యమైన అనుభూతులు కలగడం జరిగింది. ఇదంతా ఈ శతక రచనకు నేపథ్యం అయింది.




**శ్రీసాయి సూక్తి శతకము**

రచన:
**విద్వాన్ తోట రమణమూర్తి**

వెల. 20/- పేజీలు: 32

ప్రతులకు:
తోట రమణమూర్తి
సెల్. 9491240728

ఈ శతకంలో 109 పద్యాలు న్నాయి. ఆత్మనివేదన కింద 5 పద్యాలు న్నాయి. శ్రీసాయి మీద శతకంలో కేవలం భక్తి, ఆధ్యాత్మిక పరమైన పద్యాలేగాక, తాత్త్విక, సామాజిక అంశాలు కూడా పద్యాల్లో చోటుచేసుకోవడం గమనార్హం. శతక పద్యాలకు కిరీటం, నాలుగో పంక్తిగా వచ్చే మకుటమే! ఆ మకుటం సర ళంగా వుంటూ సందేశాన్ని కూడా ఇస్తున్నది. 'సకల జనుల హితము సాయి మతము' అనేది మకుటం. ఈ మకుటం సాయితత్వాన్ని సంక్షిప్తంగా చెపుతున్నది.

'జీవులన్నిటందు జీవేశు నేనైతి । ఆత్మయొకటే యుండు । నన్నిటందు నన్ను వలెనె జూడు, నిన్ను జేరినవారి । సకల జనుల హితము సాయి మతము' అన్న పద్యం 'మానవ సేవే మాధవ సేవ' అన్న సత్యాన్ని బోధిస్తున్నది. 'అప్పుజేసి నాకు ఆరాధనలు వద్దు । ముప్పుదెచ్చు, అప్పు తప్పకుండ । అప్పులేని వారె, అవని ధన్యులనియె । సకల జనుల హితము సాయి మతము' అనే పద్యం సామాజిక సత్యాన్ని తెలియజేస్తున్నది. జగము మిధ్యయగును, జగదీశు సత్యంబు । మాయజిక్కబోకు మరల మరల । జనన మరణములును జగతి నాటకమౌను' అను పద్యం తాత్త్విక చింతనతో విరాజిల్లింది. 'కపట గురువు లుండు, కనికట్టుజేసేరు । యంత్ర, తంత్రమంటు యోగి జేస్తు । మాయ నమ్మవద్దు, మర్మంబు తెలుసుకో । సకల జనుల హితము సాయి మతము। అనే పద్యం గుడ్డిగా ఎవరినీ నమ్మ వద్దంటోంది. 'హింస జేయవద్దు, హితము గానేరదు । సాయపడుచు, ప్రజకు సహకరించు । చెడ్డజేయవద్దు, చెడుదువు నీవయా । సకల జనుల హితము సాయి మతము' చెరపకురా చెడేవు అన్న సూక్తిని వివరిస్తున్నది.

ఇలా ప్రతి పద్యాన్ని భక్తి, తాత్త్విక, సామాజిక స్పృహలతో కవి రచించారు. ఈ శతకంలోని విశిష్టత ఏమంటే ప్రతీ పద్యం, ప్రతి పదం సరళంగా, సుబోధ కంగా వుండటం. అన్వయక్లిష్టత అసలే లేకపోవడం. 'అల్పాక్షరముల అనల్పార్థ రచన' అన్న విషయాన్ని తెలియ జేస్తున్నది.

కవి చివరగా 'ఆత్మనివేదన'లో 'ఇహము నందు నేను యిమడలేకున్నాను । పరుగులెత్తలేను, పరముజేర । ఇహపరం బులందు, నింపుగా తోడుండి । నడుపుమయ్య, సాయి కలత లేక - అని వేడుకున్నాడు. ఆయన కోరిక సాయి తీరుస్తారని ఆశిద్దాం. మంచి శతకాన్ని తెలుగు సాహిత్య లోకానికి అందించిన తోట రమణమూర్తి గారికి అభినందనలు, ఆశీస్సులు అందజేస్తూ, మరిన్ని శతకాలు ఆయన కలం నుండి జాలువారాలని కోరుకుంటున్నాను.



సమీక్షకులు:
**డా. గంగిశెట్టి శివకుమార్**
నెల్లూరు. ఫోన్ : 9441895343

# గౌరవపూర్వక కలయిక



ఫిబ్రవరి14వ తేదీ సాయంత్రం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని గౌరవపూర్వకంగా కలిసిన కోవూరు శాసనసభ్యులు నలపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి సమీప బంధువు కందాడ పృధ్విరెడ్డి.

# జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

## నామినేషన్ల పర్వం ప్రారంభం

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. నామినేషన్ల స్వీకారం కూడా మొదలైంది. ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ఆరంభం కావడంతో అధికారులు ఆ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం నెల్లూరులోని కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రోణంకి కూర్మనాథ్ విలేకర్లతో మాట్లాడుతూ, ఈ ఎన్నికలకు ఈ నెల 23వ తేది వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 24న నామినేషన్ల పరిశీలన జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల అభ్యర్థులు తిరుపతిలో, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు నెల్లూరు కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోగా నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని, ఉపసంహరణ అనంతరం తుది జాబితాను ప్రచురించి, మార్చి 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు. మార్చి 16వ తేదిన ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఈ ఎన్నికలకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సుళ్లూరుపేట, గూడూరు, నెల్లూరు, కావలి, ఆత్మకూరు డివిజన్‌లలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

## 'వందే భారత్'కి సాంకేతిక సహకారం మనదే

# శ్రీసిటీ నుంచి విడిభాగాలు

## దివంగత నేత వైఎస్సార్ ముందుచూపుతో మరింత ఖ్యాతి





***అం**తర్జాతీయ స్థాయి ఖ్యాతిగాంచిన పారిశ్రామికవాడగా ఆవిర్భవించిన శ్రీసిటీలోని పలు పరిశ్రమలు ఇప్పుడు దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా కూడా మరింత ఖ్యాతినార్జిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఒకరకంగా ఇదంతా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పుణ్యమే. ఆనాడు ఆయన చేసిన ఆలోచనలు, వాటిని అమలుచేస్తున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వంటి పారిశ్రామికవేత్తల ప్రతిభాపాటవాలతో ఇప్పుడు శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిలో అద్భుతాలు సృష్టిస్తోంది. ఇటీవలే ప్రధాని మోదీ ప్రారంభించిన 'వందే భారత్' ఎక్స్‌ప్రెస్ రైళ్ళకు కూడా శ్రీసిటీలోని బిఎఫ్‌జి పరిశ్రమ నుంచే అవసరమైన విడిభాగాలన్నీ సరఫరా అవుతుండడం మరో అద్భుతం! దీంతో శ్రీసిటీ పేరు సర్వత్రా మార్మోగిపోతోంది.*

దేశవిదేశాలకు చెందిన వందలాది పెద్దపెద్ద పరిశ్రమల నిలయంగా, దేశంలోని పారిశ్రామికవాడలకు ధీటుగా, సాటిలేని మేటిగా నిలుస్తున్న శ్రీసిటీ దేశానికి అవసరమైన ఎన్నో రకాల ఉత్పత్తులను అందిస్తోంది. శ్రీసిటీలో ఉన్న 'బిఎఫ్‌జి ఇండియా' పరిశ్రమ నుంచి ఇప్పుడు దేశవ్యాప్తంగా పరుగులుతీస్తున్న 'వందే భారత్' ఎక్స్‌ప్రెస్ రైళ్ళకు విడిభాగాలు సరఫరా అవుతుండడం విశేషం. శరవేగంగా వెళ్ళే 'వందే భారత్' రైళ్లకు అవసరమైన ఇంటీరియల్‌లు, టాయిలెట్ క్యాబిన్‌లు, ఇంజన్ ముందుభాగం వగైరాలన్నీ బిఎఫ్‌జీ కంపెనీయే సరఫరా చేస్తోందంటే అతిశయోక్తి కాదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఆ పనులన్నిటినీ బిఎఫ్‌జీ సంస్థ కేవలం 10 నెలల్లోనే రికార్డు స్థాయిలో పూర్తిచేయడం మరో విశేషం. అంతేకాదు, వందే భారత్ ప్రాజెక్టును మరింత ఆకర్షణీయంగా రూపొందించేందుకు పలు రకాల రంగుల ప్యానెల్స్‌ను కూడా ఆ కంపెనీ సిద్ధం చేసింది. ఒక్కోరైలు కోసం 329 రకాల ఎఫ్‌ఆర్‌పి ప్యానల్స్‌ను తయారుచేసి తన ప్రత్యేకతను చాటుకుంది. ఢిల్లీ మెట్రో రోలింగ్ స్టాక్ (కోచ్‌లు)ల కోసం బొంబార్డియర్ ట్రాన్స్‌పోర్టేషన్‌తో ఎన్నో ముఖ్యమైన విడి భాగాలను ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నారు.

### వైఎస్సార్ పుణ్యమే ఇదంతా!

శ్రీసిటీ సెజ్ స్థాపనలోనూ, దాని ప్రగతిలోనూ దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకున్న చొరవ అపూర్వం. అదే ఇప్పుడు శ్రీసిటీకి, అందులోని విశేషమైన పరిశ్రమలకు మరింత ఖ్యాతిని తెస్తోంది. వైఎస్సార్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి శ్రీసిటీలోని 'బిఎఫ్‌జి ఇండియా' పరిశ్రమ దేశంలోని వివిధ మెట్రో ప్రాజెక్టులకు, వందే భారత్ రైళ్ళ ప్రాజెక్టుకు ఫైబర్ రీఇన్‌ఫోర్స్ ప్లాస్టిక్ విడిభాగాలను సరఫరా చేస్తుండం గమనించదగ్గ విషయం. అందులోనూ శ్రీసిటీలో తొలిసారిగా ఏర్పాటైన 8 పరిశ్రమల్లో బిఎఫ్‌జి పరిశ్రమ ఒకటి కావడం, బిఎఫ్‌జి ఇంటర్నేషనల్ అనుబంధసంస్థగా ఉన్న బిఎఫ్‌జి ఇండియా పరిశ్రమ ప్రపంచస్థాయి నాణ్యతతో రూపొందిస్తున్న ఈ ఎఫ్‌ఆర్‌పి విడి భాగాలను దేశానికి అందించడం గొప్ప విషయం. 2009 నుంచి పవనశక్తి, నిర్మాణ రంగం, రవాణా వంటి వివిధ రంగాల్లో ఉన్న పరిశ్రమల కోసం ఎఫ్‌ఆర్‌పి మిశ్రమ ఉత్పత్తులు, ప్రత్యేక ఆకృతుల నిర్మాణాలు తయారవుతున్నాయి. దేశంలోని ప్రముఖ మెట్రో కోచ్ తయారీ సంస్థలు, ఆల్‌స్టం, బొంబార్డియర్, వోల్వో, ఇండియన్ రైల్వేస్‌కు చెందిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, జనరల్ ఎలక్ట్రికల్-ఎనర్జీ, గమేశ, కొచ్చిన్ షిప్‌యార్డ్, థెర్మాక్స్, ఆర్సీఎఫ్, ఎంసీఎఫ్, బెచ్‌టెల్ వంటి అనేక సంస్థలకు బిఎఫ్‌జి ఇండియా తనదైన విశేషమైన సేవలందిస్తూ, శ్రీసిటీకి కూడా గొప్ప పేరును తెస్తోంది.

# మీట్ & గ్రీట్



'ఈషా' ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సద్గురుగా విశ్వఖ్యాతి పొందిన జగ్గీ వాసుదేవ్‌జీని ఇటీవల కలుసుకుని అభినందనలు తెలియజేస్తున్న ప్రముఖ కీళ్ళు మరియు ఎముకల వైద్యనిపుణులు, స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న 'బర్డ్స్' డైరెక్టర్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి.



## కొత్తూరు శ్రీ యోగాంజనేయస్వామి దేవాలయంలో

# 27న నాగప్రతిష్ఠ

ఇందుకూరుపేట మండలం కొత్తూరులోని సుప్రసిద్ధమైన శ్రీ యోగాంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో ఈనెల 27వ తేది సోమవారం నాగదేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఆలయ ట్రస్టీలు కలికి కోదండరామిరెడ్డి-శ్రీలతల ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా 'నాగప్రతిష్ఠ' జరుగుతుంది. ఈ సందర్భంగా ఈనెల 26, 27 తేదీల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. 26వ తేది ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తర్వాత మళ్ళీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు పూజలు నిర్వహిస్తారు. 27వ తేది ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పూజలు, నాగప్రతిష్ఠ జరుగుతాయి. అనంతరం సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు కూడా విశిష్ట పూజలు నిర్వ హించనున్నామని, ఈ రెండు రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి నాగదేవత అనుగ్రహాశీస్సులను పొందాలని వారు కోరారు.

# చంద్రాని గెలిపించండి

## - నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి



తూర్పు రాయలసీమ నియోజవర్గ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 15న వెంకటగిరిలో ఉన్న ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల కరెస్పాండెంట్‌లు, ఉపాధ్యాయులతో రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్థానిక ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో మంచివారిని గెలిపించుకోవాలని, అందులోనూ సమాజసేవా భావం, నిజాయితీ కలిగిన చంద్ర వంటివారిని ఎన్నుకుంటే ఉపాధ్యాయ రంగానికి మంచి జరుగుతుందన్నారు.

FLATS FOR SALE
@
PTG HOMES
2BHK, CCP, LIFT
Plot No.1453, 2nd Street, RamNagar, North Extn.,
Madipakkam(Beside NILA HOMES), CHENNAI.
CALL: 86084 53395

లాయర్
ఫిబ్రవరి 17, 2023

# గంజాయి మత్తులో జోగుతున్న యువత!

మత్తు అనేక రకాలు. వాటిలో గంజాయి ఇంకా మత్తు. ఈ మత్తులోనే యువత చిత్తయిపోతూ ఉంది. గంజాయి వాడకం నేరమైనప్పటికీ దేశంలోని అనేకప్రాంతాల్లో నేటికీ లక్షలాదిమంది దానిని వినియోగిస్తూనే ఉన్నారని నిపుణులు చెప్తున్నారు. పలు రాష్ట్రాలో గంజాయి వాడకం ఎంతోకాలం నుంచి ఉంది. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో దీని వాడకం ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోతోంది. ఇదెంతో ఆందోళనకరం. దీనిదెబ్బకు ఆర్థికంగా ఎన్నో కుటుంబాలు నాశనం అయిపోతున్నాయి. ఆరోగ్యం పాడైపోయి, గంజాయికి బానిసలై నేరాలకు పాల్పడి జైళ్ళలో మగ్గుతున్న వారెందరో ఉన్నారు. ఒంటిని, ఇంటిని, ఆరోగ్యాన్ని, విద్యార్థుల భవితవ్యాన్ని కూడా నాశనం చేస్తున్న ఈ మత్తు వాడకాన్ని, దాని రవాణాను నిరోధించడానికి అధికారులు, పోలీసులు ఎన్నిసార్లు దాడులు చేస్తున్నా ఈ మత్తుకి బానిసలైపోయిన వారు దానిని వదలడం లేదు. అంతేకాదు, ఇంకా ఎక్కువ మందిని ఈ మత్తుకి బానిసలు చేసేస్తున్నారు. పాఠశాలల్లో చిన్నవయసులో ఉండే విద్యార్థులను, యువకులను లక్ష్యంగా చేసుకుని కొంతమంది అక్రమార్కులు అడ్డదారులో దొంగ చాటుగా వాటిని విక్రయిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి పెద్దమొత్తంలో గంజాయిని తీసుకువచ్చి పల్లెప్రాంతాల్లో, నగరాలు, పట్టణాల్లో ఎక్కడ వీలైతే అక్కడంతా అమ్ముతు న్నారు. అలాంటి వారిపట్ల ప్రతిఒక్కరూ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే ప్రమాదకరమే!

భావితరాలకు బంగారుబాటలు వేయాల్సిన యువత రానురాను చెడు వ్యసనాలకు, మత్తుపదార్ధాలకు బానిసలవుతుండడం ఆవేదన కలిగించే విషయం. ఒకసారి గంజాయికి అలవాటు పడితే..ఇక అది మనలను వదలనే వదలదు. మన శరీరాన్ని అది స్వాధీనం చేసుకుంటుంది. ఆ మత్తు లేకుంటే ఇక బతకలేమో అనిపించేలా చేస్తుంది. ఆరోగ్యాన్ని క్రమేణా సర్వనాశనం చేస్తూ నరకం చూపిస్తుంది. చివరికి ఆ మత్తులోనే మట్టుపెడుతుంది. కనుక, ఎవరూ ఈ మత్తు జోలిక పోకూడదు. గతంలో ఎక్కడో చాటుమాటుగా, రహస్యంగా నాలుగు గోడల మధ్యనే గంజాయి తాగుతుండే వారు. ఇప్పుడది బహిరంగమైపోతుండడం దారుణం. పాఠశాల విద్యార్థులకు, యువతకు ఎరవేసి గంజాయిపొడిని అమ్మేస్తున్నారు అక్రమ వ్యాపారులు. అమాయకులైన విద్యార్థులు ఎవరో ఒకరి ప్రభావంతో దానిని కొనేసి రహస్యంగా తాగేస్తున్నారు. సిగరెట్లలో గంజాయి పొడి వేసి తాగడం యువతకు ఒక పెద్ద ఫ్యాషన్‌గా తయారైంది. అలా ఎవరికి ఇష్టమైన రూపంలో వారు గంజాయిని సేవిస్తున్నారు. ఈ మత్తుపదార్థాన్ని వాడడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోతుందని, మెదడులో నరాలు దెబ్బతింటాయని, గుండె జబ్బులు వచ్చేలా చేస్తుందని, చివరికి పూర్తిస్థాయిలో మతిభ్రమించేలా చేస్తుందని వైద్యనిపుణులు చెప్తూనే ఉన్నారు. అయినా ఎవరు పట్టించుకుంటు న్నారు?.. ఈ మత్తుకు బానిసలైన వారి ప్రవర్తన వికృతంగా ఉంటుంది. ఒక్కోసారి క్రూరంగా కూడా ఉంటుంది. తల్లి తండ్రులను కూడా లెక్కచేయకపోవడం వంటి చెడు లక్షణాలు ఆవరిస్తాయి. పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారు?..వారు సక్రమంగా పాఠశాలలకు వెళ్తున్నారా?..సరిగ్గా చదువుకుంటున్నారా?..అని ప్రతినిత్యం గమనిస్తుండాలి. అది తల్లితండ్రులకు తప్పనిసరి బాధ్యత. గంజాయి అంటే ఒక భయంకర రాకాసిగా అర్థం చేసుకోవాలి. దానికి ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలి.

ప్రభుత్వాలు ఇకనైనా ఉదాసీనత వదిలి, మునుపటికంటే మరింత శ్రద్ధపెట్టి గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. అన్నిప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను, నిఘా బృందాలను అప్రమత్తం చేయాలి. ఎవరూ ఎలాంటి మత్తుపదార్థాల జోలికి వెళ్ళకుండా ఒక నిరంతర ప్రక్రియగా ప్రజలను చైతన్యవంతం చేస్తుండాలి. అదొక సామాజిక బాధ్యత అని అందరూ గుర్తుంచుకోవాలి. పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ ఉపాధ్యాయులు, నిపుణులు, పోలీసులు పదేపదే సమావేశాలు ఏర్పాటుచేసి గంజాయి మత్తుకు విద్యార్థులు, యువత దూరంగా ఉండేలా అవగాహన కలిగిస్తుండాలి. గంజాయి రవాణాపై పోలీసు ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపాలి. ఈ మాయదారి మత్తుపదార్థాన్ని అక్రమ రవాణా చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్న అక్రమార్కులపై ప్రభుత్వాలు కఠినచర్యలు తీసుకోవాలి. లేకుంటే ఆ మత్తుకు యువత పూర్తిగా చిత్తయిపోయి, భవిష్యత్తు నాశనమై.. ఎందరో జీవితాలు అంధకారబంధురమై పోతాయి. చివరికి అతీగతీ లేకుండా కొడిగట్టుకుపోతాయి. తస్మాత్!..జాగ్రత్త!..

# అరాచకాలు, అక్రమాలు నిన్నటి వరకు కనపడలేదా?

రాజకీయాలు విచిత్రంగా ఉంటాయి. అలాగే రాజకీయ నాయకుల విమర్శలు కూడా వింతగా ఉంటాయి. నిన్నటివరకూ తమ పార్టీలో తమపక్కనే తిరిగిన వ్యక్తి, ఉన్నట్లుండి పార్టీ మారితే... ఆ నేతలు ప్రవర్తించే తీరు విడ్డురంగా ఉంటుంది. తాజాగా నెల్లూరు రూరల్ శాసన సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై అధికార వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు, వినిపిస్తున్న తిట్లదండకం చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంది. తాను పార్టీ వీడుతున్నానని ప్రకటించే వరకూ ఆయన అధికారపార్టీ వైసీపీలోనే ఉన్నాడు. ఇప్పుడు శ్రీధర్‌రెడ్డి, ఆయన తమ్ముడు గిరిధర్‌రెడ్డితో కలిసి అన్యాయాలు, అక్రమాలు, అరాచకాలు, చేశాడని ఆరోపిస్తున్నారు. దాడులు చేయించారు, దారుణాలకు పాల్పడ్డారు, అక్రమంగా కోట్లు సంపాదించారు అని గగ్గోలు పెడుతున్నారు. అలా మాట్లాడుతున్న వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు నాది ఒకటే ప్రశ్న...? ఆయన చేసిన, చేస్తున్న అన్యాయాలు, అక్రమాలు, దాడులు, దారుణాలు మీకు ఆయన మీ పార్టీలో ఉన్నప్పుడు కనపడలేదా...? లేదంటే ఇలాంటి సంఘ విద్రోహక కార్యక్రమాలను విచ్చలవిడిగా నిర్వహించడానికి అధికారపార్టీలో ఉన్న వారికి మాత్రమే వాళ్ళ నాయకుడేమైనా లైసెన్స్ ఇచ్చాడా...? శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు సచ్ఛీలురని నేను అనడంలేదు. మీ ఆరోపణలతో నేనూ ఏకీభవిస్తున్నాను. శ్రీధర్‌రెడ్డి లాంటి వాళ్లు వైసీపీలో ఇంకా కొంతమంది ఉన్నారు. వాళ్ళని గురించి కూడా మాట్లాడండి. వాళ్ళు కూడా పార్టీని వీడేవరకు వేచి చూడకండి. పార్టీకి నష్టం కలిగించే చీడపురుగులు పార్టీలో ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. పార్టీని అడ్డం పెట్టుకుని ఇలాంటి వాళ్ళు బాగుపడుతున్నారు తప్ప.. వాళ్ళవల్ల పార్టీకి జరిగే లాభమేమీ ఉండదు. అలాంటి వాళ్ళను భరించడంకంటే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లాభపడి చివరి రోజుల్లో మరో పార్టీ వైపు చూసేవాళ్ళని ముందే తరిమి కొట్టడం మంచిది.

కే.వీ.రెడ్డి, సంగం.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# అన్నదాతలు నష్టపోకుండా చూడాలి

జిల్లాలో వరికోతలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి రైతుల వద్ద ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తుండడం సంతోషదాయకం. అయితే, తేమ శాతం ఎక్కువుగా ఉందనో, రంగు మారిందనో... కుంటి సాకులు చెప్పి అన్నదాతలను ఇబ్బంది పెడుతుండడం తరచూ జరుగుతూనే ఉంది. రైతులు దళారుల వద్దకు, మిల్లుల యజమానుల వద్దకు వెళ్లకుండా నేరుగా ప్రభుత్వానికి ధాన్యం విక్రయించేందుకు ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు, గతంలో వలె కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విన్నపం. ప్రతి సీజన్‌లోనూ రైతులు అనేక కష్టనష్టాలకు గురౌతూనే ఉన్నారు. తీరా ధాన్యం కొనుగోలుకు వచ్చేటప్పటికి అక్కడకూడా రైతులకు అన్యాయం జరగడం మంచిదికాదు. రైతు కష్టం వృధా కాకుండా ప్రభుత్వం, అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

– ఎస్.రాఘవయ్య, కొడవలూరు.

# బాబోయ్!..కల్తీ మాంసం!



జిల్లాలో ఇప్పటికే ఉన్న కల్తీలతో జనం చస్తుంటే, కొంతకాలంగా మాంసం కల్తీలు ప్రజల్ని హడలగొడుతున్నాయి. నెల్లూరులో ఎప్పుడూ ఇలాంటి దుర్బుద్ధి లేదు. మంచి భోజనానికి మారుపేరు నెల్లూరు. అందుకే, జిల్లాలోనే కాక మద్రాసు వంటి ఇతర ప్రాంతాల్లో కూడా 'నెల్లూరు భోజనం హోటళ్ళు' బాగా రద్దీతో ఉంటాయి. అలాంటిది కొంతమంది అక్రమ వ్యాపారులు నీచపు వ్యాపారాలతో నెల్లూరు పేరు చెడగొడుతున్నారు. మాంసం ప్రియులకు కోడి మాంసం అంటే ఎంతో ఇష్టం. లొట్టలేసుకుంటూ తింటుంటారు. ఎక్కువగా ఆదివారం రోజుల్లో, పండుగలు పబ్బాల రోజుల్లో కోడిమాంసానికి భలే గిరాకీ ఉంటుంది కూడా. జిల్లాలోని అనేక హోటళ్ళలో కోడిమాంసంతో బిర్యానీ చేస్తుంటారు. చికెన్ కర్రీ, చికెన్ సిక్స్టీఫైవ్, బోన్‌లెస్ చికెన్, చికెన్ మసాలా, చికెన్ వేపుడు ఇలా రకరకాల పేర్లతో కోడిమాంసం బాగా విక్రయమవుతుంటుంది. ఇదే సందని అక్రమవ్యాపారులు జనం సంతోషంగా తినే చికెన్‌ను కూడా కల్తీ చేసిపారేస్తున్నారు. మద్రాసు వంటి ప్రాంతాల్లో తినలేక పారేసే కోళ్ల వ్యర్థాలు వీరికి వ్యాపార వస్తువులయ్యాయి. ఇంకేముంది.. ధర తక్కువ, ఫలం ఎక్కువ అన్నట్లు అదేపనిగా వాహనాల్లో దొంగచాటుగా వాటిని తరలించుకువచ్చి, తక్కువ ధరకే అమ్మేస్తున్నారు. వాటిని ఫ్రీజర్లలో కేజీలకొద్దీ దాచిపెట్టి, అవసరమైనప్పుడల్లా వాటిని వేడివేడిగా వండి వార్చేస్తున్నారు. కారం మసాలా వేస్తే ఏదైనా వేడిగా వండేస్తే రుచిగానే ఉంటుందన్న సామెతగా, మురుగుడు మాంసాన్ని, పురుగులు పట్టిన మాంసాన్ని కూడా కడిగి బాండలికెక్కిస్తున్నారు. అమాయక జనం కోడికూర కదా..భలే బావుందంటూ తినేస్తున్నారు. కుటుంబాలతో సహా హోటళ్ళకు, రెస్టారెంట్లకు వచ్చి, రేటు ఎంతున్నా లెక్కచేయకుండా వందలు ఖర్చుపెట్టి ఏ బిర్యానీయో, లేదా కిచెన్ కర్రీయో తింటే..ఇంకేముందీ?..జీర్ణవ్యవస్థ పాడైపోయి

## సమస్యల తో 'రణం'

లేనిపోని రోగాలు వస్తాయి. ఇలా ప్రజారోగ్యాన్ని సర్వనాశనం చేసేస్తున్నారు కొందరు అక్రమ వ్యాపారులు. ఇంతకన్నా ఘోరం ఇంకేముంటుంది?.. ఇంతకన్నా పాపం ఏముంటుంది?.. తినే ఆహార పదార్ధాలను వ్యర్థపదార్థాలతో కలిపేసి అమ్మేసి అక్రమంగా డబ్బు సంపాదించుకోవడం కూడా ఒక వ్యాపారమేనా?..ఛీఛీ!..

### నెల్లూరులో మరీ ఘోరం

కోళ్ళ మాంసం వ్యర్థాల వ్యాపారం నెల్లూరులో గత కొద్దికాలంగా గుట్టు చప్పుడు కాకుండా జోరుగా సాగిపోతోంది. కార్పొరేషన్ ఆరోగ్యవిభాగం అధికారి ఒకరు..ఒకసారి ఓ మాంసం దుకాణంలో కోళ్ళ వ్యర్థాలు, మురుగి గబ్బుకొడుతున్న కోళ్లమాంసాన్ని దాడులు చేసి పట్టుకోవడంతో ఈ ఘోరం బయటపడింది. అప్పటినుంచి అప్పుడప్పుడూ దాడుల్లో మురుగుడు చికెన్ బయటపడుతూనే ఉంది. పోలీసులు కూడా వాహనాల తనిఖీలు చేసేటప్పుడు పలుసార్లు మద్రాసు నుంచి కోళ్ళ వ్యర్థాలు భారీఎత్తున తీసుకువస్తున్న వాహనాలు కూడా దొరికాయి. అయినా అక్రమార్కులకు భయం ఏముందీ? పట్టుకుంటే జరిమానా వేస్తారు.. కట్టేద్దాం అన్న ధీమాతో ఉంటారు. వాళ్ళదేం పోయింది. సందు దొరికినప్పుడు మాంసం రేట్లు పెంచేస్తే, ఆ జరిమానా డబ్బుకంటే ఇంకా ఎక్కువొస్తుందన్న మాట. ఇలాంటి కల్తీ వ్యాపారాలను నిరోధించేందుకు చట్టాలైతే ఉన్నాయి కానీ, వాటిని ఎవరు లెక్కచేస్తున్నారు కనుక! ఎక్కడ చూసినా కల్తీయే రాజ్యం చేస్తున్న కాలమిది. అడిగేదెవరు?.. ఆపేదెవరు?.. ఎవరన్నా అడిగినా వారికి ఇవ్వాల్సిన తాంబూలం ఇచ్చేస్తే సరి!..అన్నట్లుగా తయారైంది. దీంతో చిన్నగా ఈ వ్యాపారం నెల్లూరు నగరం నుంచి జిల్లాకంతటికీ లోపల్లోపలే పాకిపోయింది. పారేసిన కోళ్ళ వ్యర్థాలను తీసుకువచ్చి, ఎక్కువ ధరకు విక్రయించగలిగితే బోలెడంత డబ్బు వస్తుందని అక్రమార్కులు ఈ వ్యాపారానికి తెరలేపారు. ఇది ఇంతటితో ఆగిపోలేదు.. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు కూడా విస్తరించినట్లు తెలుస్తోంది. ఏ చికెన్‌లో ఏముందో ఎవరికి తెలుస్తుంది?.. అది మురిగిపోయిన మాంసమా కాదా అన్నది ఎవరు చూస్తున్నారు?.. దుకాణాల్లో కాక, ఇళ్ళలోనే దాచి పెట్టుకుని విక్రయించేస్తున్నారు. ఎక్కడికక్కడ అధికారులు, పోలీసులు, కల్తీ నివారణ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తూనే ఉండాలి. ప్రజారోగ్యానికి పాతరేస్తున్న అక్రమార్కులపై గట్టి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం కూడా ఈ కల్తీ చికెన్‌పై దృష్టి సారించాలి. చట్టాలకు మరింత పదును పెట్టాలి. కుళ్ళిపోయి, గబ్బుకొట్టి, పురుగులు పట్టిన చికెన్‌ను అమ్ముతున్నా నామమాత్రపు జరిమానాలు కాదు, గట్టి చర్యలు తీసుకునేలా చట్టాలను సవరించాలి. ఈ అక్రమ గబ్బు వ్యాపారం ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా నిఘా పెట్టాలి. ఎప్పుడో ఒకసారి అని కాక, నిరంతరం అధికారులు, పోలీసులు ఈ తనిఖీలు చేసైనా సరే, దీనిని అరికట్టాలి. కనీసం మానవత్వం కూడా లేకుండా కేవలం డబ్బు సంపాదన కోసం ఇలాంటి పనికిమాలిన వ్యాపారాలు చేస్తారా?..ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటారా?.. ఎంతకాలమని ఎవరైనా వీటికి కాపలా కాస్తుంటారు?..ఏ దుకాణంలో, ఏ హోటల్లో, ఏ రెస్టారెంట్లో వీటిని దొంగచాటుగా కోళ్ళవ్యర్థాలను కల్తీ చేసి వండిపెడుతున్నారో ఎవరికి తెలుస్తుంది?..అయినా, తినే తిండిని కూడా మరీ ఇంత ఘోరంగా కల్తీ చేయడం నేరమే కాదు..అత్యంత నీచం కూడా. మనుషులైన వారెవరూ ఇలాంటి నీచపు వ్యాపారాల జోలికి పోరు!... ఇంత కన్నా ఏం చెప్పగలం?....

– సంచారి

# నెల్లూరులో భారీ దోపిడీలు

**తండ్రిని, కూతురిని కట్టేసి సొమ్ము దోచేశారు**

**విశ్రాంత మైనింగ్ అధికారి ఇంట్లో సొత్తంతా కాజేశారు**

*నెల్లూరు నగరంలో చోరీలు పెరిగిపోతున్నా యని ఆందోళన చెందుతుంటే, ఇప్పుడు ఏకంగా దుండగులు దోపిడీలకే పాల్పడుతున్నారు. ఇళ్లలోకి జొరబడి ఇంట్లో ఉన్నవాళ్ళని కట్టేసి మరీ సొత్తు దోచుకుపోతున్నారు. దీంతో నగర ప్రజలు హడలిపోతున్నారు.*

నగరంలోని చైతన్యపురికాలనీ శ్రీనివాసం అపార్ట్‌మెంట్‌లో ఈనెల 13వ తేది రాత్రి నలుగురు దోపిడిదొంగలు జొరబడి డబ్బు, బంగారం దోచుకుపోయిన సంఘటన జిల్లాలో సంచలనం కలిగించింది. ఆ అపార్ట్‌మెంట్ యజమాని ప్రసేన్‌కుమార్‌రెడ్డి చెన్నైలో వెల్డింగ్ కాంట్రాక్టర్. ఆయన చెన్నైకి వెళ్ళి ఉండగా, ఇక్కడ ఇంట్లో ఆయన కుటుంబసభ్యులైన సుందరరామిరెడ్డిని, ఆయన కుమార్తెను కత్తితో బెదిరించి, తాళ్ళతో కాళ్లు చేతులు కట్టేసి దాదాపు 10 లక్షల రూపాయలు విలువచేసే బంగారు నగలు, డబ్బును దుండగులు మూటగట్టుకుపోయారు. దాదాపు రెండున్నర గంటలపాటు ఇంట్లోనే ఉండి ఈ దోపిడీకి పాల్పడ్డారని బాధితులు లబోదిబోమంటున్నారు. ప్రసేన్‌కుమార్‌రెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగి దుండగుల కోసం గాలిస్తున్నారు.

## విశ్రాంత జేడీ ఇంట్లో కోటికిపైగానే చోరీ

నెల్లూరులోని కొండాయపాళెం వద్దనున్న మిలిటరీ కాలనీలో నివాసం ఉంటున్న గనులు, భూగర్భశాఖ విశ్రాంత జేడీ (జాయింట్ డైరెక్టర్) జకరయ్య ఇంట్లో ఈనెల12వ తేది రాత్రి భారీచోరీ జరిగింది. దొంగలు ఇంటి వెనుకభాగంలో వేసివున్న తాళం పగుల గొట్టి లోపలకి ప్రవేశించి ఉన్న బంగారు, డబ్బునంతా ఊడ్చుకుపోయారు. ఇంటికి తాళం వేసి జేడీ హైదరాబాద్‌కు వెళ్ళి ఉండగా ఈ చోరీ జరిగింది. జేడీ కుమార్తె హైదరాబాద్‌లో ఐపిఎస్ అధికారిగా పనిచేస్తుండడంతో తరచూ ఆయన అక్కడికి వెళ్తుంటారు. అది గమనించిన దుండగులు ఈ చోరీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. ఇరుగుపొరుగు వారి సమాచారంతో జేడీ పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి కేసు దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ విజయారావు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. వేలిముద్రలు, సిసి కెమెరాల ఆధారంతో నిందితులను గుర్తించేందుకు క్లూస్ టీమ్‌ను రప్పించారు. ఈ ఘటనలో దొంగలు దాదాపు కోటి 74లక్షలకుపైగానే బంగారు, డబ్బు అపహరించినట్లు జేడీ కుమారుడు పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు సమాచారం.

# ఎన్‌బికెఆర్‌లో.. 'స్కిల్ డెవలప్‌మెంట్'

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల ఎలక్ట్రిక్ ఆల్ టెర్రైన్ వెహికల్ డిజైన్ మరియు ఫ్యాబ్రికేషన్‌పై స్కిల్ డెవలప్‌మెంట్ (నైపుణ్యాభివృద్ధి) కార్యక్రమాలు జరిగాయి. 5 వారాల ఇన్‌హౌస్ మరియు ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ఆన్‌లైన్ మోడ్‌తో ప్రారంభించారు. హైదరాబాద్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు, ఫాటర్నిటీ ఆఫ్ మెకానికల్ అండ్ ఆటోమొబైల్ ఇంజనీర్లు అమన్, రవి రాబిన్, ఆదిత్యరావు, అనిల్ సింగ్ మెహతా తదితరులు పాల్గొన్నారు. కంపెనీ ప్రతినిధి ఆదిత్యరావు మాట్లాడుతూ, రానున్న దశాబ్దకాలంలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆటోమొబైల్ మరియు ఎలక్ట్రిక్ వాహన తయారీ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయన్నారు. రవి రాబిన్ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ఎలక్ట్రిక్ వెహికల్ తయారీలో మెళకువలు నేర్పించి జాతీయ మరియు అంతర్జాతీయ పోటీలకు కావలసిన శిక్షణ ఇస్తున్నట్లు తెలియచేశారు. ఈ ఇంటర్న్‌షిప్ శిక్షణలో విద్యార్థులు సింగిల్ సీటర్ (ఫోర్ వీలర్ డ్రైవ్) ఏ.టీ.వీ. బగ్గీని డిజైన్ చేసి తయారుచేయబోతున్నారని కంపెనీ ప్రతినిధి అమన్ తెలిపారు. ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ ఖర్చు దాదాపు రూ.8.5 లక్షలను తమ కళాశాల భరిస్తుందని, హిమాచల్‌ప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయంలో ఏప్రిల్‌లో జరగనున్న ఈవెంట్‌లో పాల్గొనే ఎన్‌బికెఆర్ విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఈ ఇంటర్న్‌షిప్ శిక్షణను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. విభాగాధిపతి విక్రమ్‌కుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనేందుకు అవకాశమిచ్చిన ఎన్‌బికెఆర్ కళాశాల యాజమాన్యానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలియచేశారు.



## అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన

# నెల్లూరీయులు

**పశ్చిమబెంగాల్‌లో మార్మోగిన నెల్లూరు పేరు**

**71 పతకాలు సాధించిన క్రీడాకారులు**

అథ్లెటిక్స్ పోటీల్లో నెల్లూరీయులు తమ సత్తా చాటుకున్నారు. ఏకంగా 71 పతకాలు సాధించి అందరి అభినందనలు అందుకున్నారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో జరిగిన 42వ జాతీయ వెటరన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పెద్దసంఖ్యలో పతకాలు సాధించడం సంచలనంగా మారింది. పశ్చిమ బెంగాల్‌లో నెల్లూరు పేరు మార్మోగింది. ఈ క్రీడల పోటీల్లో మొత్తంగా 25 స్వర్ణ పతకాలు, 33 రజత పతకాలు, 13కాంస్య పతకాలు సాధించడంతో నెల్లూరు క్రీడాకారుల ఆనందానికి అవధుల్లేవు. ఈ సందర్భంగా విజేతలందరినీ జిల్లా వెటరన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఇ.భాస్కర్‌రెడ్డి, డి.బసవయ్యలు అభినందించారు.

## రేషన్‌కార్డుదారులకు..

# త్వరలో చిరుధాన్యాలు

**బియ్యానికి బదులుగా ఇక రాగులు, జొన్నలు**

జిల్లాలోని అత్యధికశాతం మంది రేషన్‌కార్డుదారులు ప్రభుత్వం ప్రతినెలా తమకు ఇస్తున్న బియ్యానికి బదులుగా రాగులు, జొన్నలు వంటి చిరుధాన్యాలను కోరుకుంటున్నారని, ఆమేరకు త్వరలోనే వాటిని కార్డుదారులకు అందివ్వాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు భావిస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే వచ్చే మార్చి నుంచే ప్రయోగాత్మకంగా వాటిని త్వరలోనే అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. చాలామంది బియ్యాన్ని సరిగా వాడుకోవడం లేదని, కొన్నిచోట్ల అవి దుర్వినియోగానికి గురవుతున్నాయని, వాటికి బదులుగా చిరుధాన్యాలు ఇస్తే బావుంటుందనే అభిప్రాయాలు సర్వత్రా వినవస్తున్న నేపథ్యంలో, అధికారులు నిర్వహించిన సర్వేలో కూడా 75శాతం మంది బియ్యానికి బదులు చిరుధాన్యాల వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. దీంతో తక్కువ ధరకే అధికారులు రాగులు, జొన్నలు అందించనున్నట్లు తెలుస్తోంది.

## ఈ 'మహాశివరాత్రి'..

# ఎంతో విశిష్టమైనది

**'శనిత్రయోదశి' కూడా కలవడం అరుదైన విశేషం**



ఫిబ్రవరి 18వ తేది శనివారం ఎంతో విశిష్టమైనదని, ఆ రోజు మహాశివరాత్రి పర్వదినంతో పాటు, శనిత్రయోదశి కూడా కలిసి వస్తుందని, ఈ శుభదినాన శివారాధన, ఈశ్వ రాభిషేకం గొప్ప అదృష్టమని శ్రీ అవధూత పీఠం నెల్లూరు శాఖ ఆధ్వర్యంలోని శ్రీకృష్ణ యోగ మందిరం ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి విజయకుమార్ తెలిపారు. ఈ విశేష సందర్భాన్ని పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలోని శ్రీకృష్ణ యోగ మందిరం ప్రాంగణంలో ఉన్న శ్రీ ఉమాదేవి సమేత నాగేశ్వరస్వామి మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. శనిత్రయోదశి నాడు ప్రదోషకాల శివార్చన ఎంతో శ్రేష్టమైనదని, ఆ సమయంలో మహాశివునికి అభిషేకం సకల శుభాలను కలిగిస్తుందన్నారు. ఆరోజున మందిరంలో ఉదయం 6 గంటలకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 8 గంటల నుంచి ఏకరుద్రాభిషేకాలతో పాటు, ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు శనీశ్వరునికి పూజలు, తైలాభిషేకాలు జరుగుతాయన్నారు. ఆ తర్వాత సాయంత్రం 5.30 గంటలకు ప్రదోషకాల అభిషేకాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. రాత్రి 11 గంటల నుంచి మహాశివరాత్రిని పురస్కరించుకుని 'లింగోద్భవ కాల అభిషేకం' ఉంటుందన్నారు. అదేవిధంగా, 19వతేది ఉదయం 9.30గంటలకు మందిరంలో శ్రీ ఉమాదేవి-నాగేశ్వరస్వామివార్ల కల్యాణమహోత్సవం కనువిందుగా చేస్తామని, రాత్రి 7గంటల నుంచి స్వామివార్లకు పల్లకిసేవ ఉంటుందని, అవధూత శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, శ్రీ దత్త విజయానందతీర్థ స్వామీజీల అనుగ్రహాశీస్సులతో జరిగే ఈ విశిష్టపూజా కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆ పరమేశ్వరుని అనుగ్రహం పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పూజల్లో పాల్గొనాలనుకునే భక్తులు నగరంలోని శ్రీ గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్టు ఫోన్ నెంబరు 94415 48655కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# 19న..ఎస్‌ఐ రాతపరీక్షలు

ఎస్‌ఐ ప్రిలిమినరీ రాతపరీక్షలకు జిల్లా పోలీసు అధికారులు జిల్లావ్యాప్తంగా 16 కేంద్రాలను సిద్ధం చేశారు. ఫిబ్రవరి 19వ తేదీ ఆదివారం రోజున పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా ఎస్పీ విజయారావు పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. నెల్లూరు నగరంలో, రూరల్ పరిధిల్లో 16 కేంద్రాల్లో 7835 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మళ్ళీ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండువిడతలుగా పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

# జక్కా వెంకయ్య సతీమణి పార్వతమ్మ కన్నుమూశారు

**● నివాళులర్పించిన నాయకులు**





జిల్లాలో పేరొందిన సిపిఎం(మార్క్సిస్ట్ పార్టీ) నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత జక్కా వెంకయ్య సతీమణి జక్కా పార్వతమ్మ ఫిబ్రవరి 14వ తేది మంగళవారం రాత్రి కన్నుమూశారు. నెల్లూరులోని ఏసీనగర్‌లో ఉన్న నివాసంలో ఆమె భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు సందర్శించి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె పార్థివదేహాన్ని ప్రజలు, కార్యకర్తలు, నాయకుల సందర్శనార్థం బాలాజీ నగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయానికి తరలించారు. బుధవారం జరిగిన ఆమె అంతిమయాత్రలో పెద్దసంఖ్యలో ప్రజలు, కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సిపిఎం నాయకులు చంద్ర రాజగోపాల్, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మోహన్‌రావు, శ్రీనివాస్, మస్తాన్‌బీ, అన్నపూర్ణమ్మ, శ్రీనివాసులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తల.. మహా ధర్నా



దీర్ఘకాలంగా పరిష్కారం కాని తమ సమస్యలను ఇకనైనా తీర్చాలంటూ జిల్లాలోని ఆశా కార్యకర్తలు ఈనెల 14న నెల్లూరులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున మహా ధర్నాందోళన నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో ఆశావర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలందిస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తెస్తున్న ఆశా కార్యకర్తల కష్టాలు తీర్చాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు వారికి కనీసవేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. ఇప్పుడిచ్చే 10వేల రూపాయల వేతనం కూడా రెండువిడతలుగా ఇస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలన్నారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో పాదయాత్ర చేసినప్పుడు ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఏళ్ళు గడిచిపోతున్నా, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటే మరచిపోయారన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వోద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశా కార్యకర్తలు డిఎంఅండ్‌హెచ్ఓ పెంచలయ్యకు సమస్యల వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో సిఐటియు నాయకుడు టివివి ప్రసాద్, యూనియన్ నాయకురాలు కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## నెల్లూరు కబుర్లు

# వాత్సల్యకు రూ.20 లక్షల విరాళం



నెల్లూరులోని కొండాయపాలెంరోడ్డులో ఉన్న జనహిత-వాత్సల్య అనాథ శరణాలయానికి సంబంధించిన భవన సముదాయాలు మరమ్మతులకు గురై, తగిన వసతులు లేకపోవడంతో బాలబాలికలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన నెల్లూరు జేమ్స్‌గార్డెన్‌కు చెందిన చేజర్ల సుభాషిణి తన భర్త దివంగత చేజర్ల జనార్దన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఈనెల 14న 20 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఆ మొత్తాన్ని జనహిత కార్యనిర్వాహక సభ్యులు నాగారెడ్డి హరికుమార్‌రెడ్డికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పెనుబాక గంగాధర్‌రెడ్డి, గడ్డం విజయలక్ష్మి, రఘునాథరాజు తదితరులు పాల్గొన్నారు. ఆ విరాళంతో జనహిత వాత్సల్య భవనములకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తామని వాత్సల్య సంఘటనా కార్యదర్శి జివి సాంబశివరావు తెలియజేశారు.

### పర్యాటక ప్రాంతాల పరిరక్షణకు..

# 'టూరిస్ట్ పోలీసు'లు

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల రక్షణ కోసం ఇకనుంచి ఆయా ప్రాంతాల్లో 'టూరిస్ట్ పోలీస్' పేరుతో పోలీస్ అవుట్‌పోస్ట్‌లను ఏర్పాటుచేస్తున్నామని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏపి టూరిస్ట్ పోలీస్ సేవాకార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలోని శ్రీ లక్ష్మీ నృసింహాస్వామి దేవస్థానంలోను, మైపాడు, కోడూరు బీచ్‌లలోను సందర్శకుల భద్రత కోసం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొత్తగా అవుట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో చోరీలు జరగకుండా చూడడం, ఈవ్‌టీజింగ్, అసాంఘిక కార్యక్రమాలు వగైరాలను నివారించేందుకు అక్కడున్న పోలీసులు కృషిచేస్తారని, సముద్రతీరాల్లో ఎవరూ గల్లంతు కాకుండా రక్షణకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

# ఆదాలను కలిసిన మెట్టుకూరు



వైకాపా ఉదయగిరి నియోజకవర్గానికి పరిశీలకునిగా ఇటీవల నియమితులైన మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఫిబ్రవరి 12న మర్యాదపూర్వకంగా నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కలుసుకున్నారు. శాలువతో ఆదాలను సత్కరించారు.

# గీతామయికి.. 'రత్నం' విరాళం



నెల్లూరు బాలాజీ నగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమానికి రత్నం విద్యాసంస్థల అధినేత, విద్యాదాత కెవి రత్నం ఈనెల 14న 16,108 రూపాయలు, నాలుగు బస్తాల బియ్యం, 60 దుప్పట్లు, పండ్లు వితరణగా అందజేశారు. 2004లో తాము చిన్నారి హార్ట్ ఫౌండేషన్ ఏర్పాటుచేసి, 2008 వరకు 168 మందికి గుండె ఆపరేషన్లు చేయించామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఫౌండేషన్‌లో మిగిలిన రూ 16,108 డబ్బును వృద్ధాశ్రమం నిర్వాహకుడు తమ్మినేని పాండుకు అందజేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు నరసింహులునాయుడు, గంగాధర్, సుధాకర్, శాంతిలాల్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిరైతుకు మద్దతు ధర ఇచ్చేలా కృషి

**- జేసీ కూర్మనాథ్**

జిల్లాలో వరికోతలు ప్రారంభమైన నేపథ్యంలో, ధాన్యం కొనుగోలుకు జిల్లా వ్యాప్తంగా 124 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని, ప్రతిరైతుకు మద్దతు ధర ఇచ్చి ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు కృషిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ ఆదేశించారు. ఈనెల 14న నెల్లూరు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరను ప్రకటించిందని, క్వింటాలుకు ఏ-గ్రేడ్ రకానికి రూ.2060, కామన్ రకానికి రూ.2040 వంతున అందజేస్తామని చెప్పారు. జిల్లాలో 4.5లక్షల ఎకరాల్లో రైతులు వరిని పండిస్తున్నారని, ఆ ధాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు.





# 18న 'మహాశివరాత్రి'..రాత్రికి లింగోద్భవం

## మూలస్థానేశ్వరాలయంలో నేత్రపర్వంగా బ్రహ్మోత్సవాలు

ఫిబ్రవరి 18వతేది శనివారం మహాశివరాత్రి పర్వదినం. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని ప్రసిద్ధమైన శ్రీ భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో కన్నులపండువగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోజు ఉదయం గిన్నెభిక్ష ఉత్సవం, రాత్రికి లింగోద్భవం పూజాకార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ అర్చకులు ప్రతినిత్యం స్వామివారిని శోభాయమానంగా అలంకరించి విశేషపూజలు, సేవలు చేస్తున్నారు. గిన్నెభిక్ష అనంతరం స్వామివారికి 'వెండినంది సేవ' నగరోత్సవం ఉంటుంది. 19వతేది స్వామివారికి- అమ్మవారికి కల్యాణోత్సవం, అనంతరం గజవాహనసేవ జరుగుతాయి. 20వ తేది ఉదయం 10 గంటలకు స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 21న పులి వాహనసేవ, 22వ తేది రాత్రి అలకలతోపు, 23వ తేది ఉదయం తీర్థవాది అనంతరం, ధ్వజావరోహణం జరుగుతుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు, జిల్లా అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీప కాంతులతో దేదీప్యమానం చేశారు. నిత్యం భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

# వాహనదారులు నిబంధనలు పాటించాలి



**- ఉప రవాణా కమిషనర్ చందర్**

రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని వాహనదారులు తప్పనిసరిగా రవాణా శాఖ నిబంధనలు పాటించాలని, వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పి నెంబర్ ప్లేట్లు, రిఫ్లెక్టింగ్ టేపులు తప్పనిసరిగా అమర్చుకోవాలని ఉప రవాణా కమిషనర్ బి.చందర్ ఒక ప్రకటనలో స్పష్టం చేవారు. వాహనదారులు ఈ నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

# 'తంగిరాల మహాభారతం' 43వ భాగం

అలా తమ వెనుకాల వస్తున్న హిడింబిని చూసి, రాక్షసులని నమ్మకూడదు, నిన్ను కూడా నీ అన్న దగ్గరకే పంపుతానంటాడు. ధర్మరాజు, కుంతీ... భీముణ్ణి మందలించి, ఆమె మనకేమి అపకారం చెయ్యలేదు, కోపం కూడదు అన్నప్పుడు... హిడింబి వారికి కృతజ్ఞతలు చెప్పి, భీముడు తిరస్కరిస్తే, తానింక జీవించజాలనని, తనను స్వీకరించుమని, తనకు వర్తమాన, భూత, భవిష్యత్ కాలాలు తెలుసనీ, తన పేరు కమలపాలిక అని ఒక సంఘటన చెపుతుంది. కొంత దూరంలో శాలిహోత్ర ఆశ్రమం ఉంటుంది, మీరు అక్కడికి వెళ్ళగానే, వేదవ్యాసుడు వచ్చి, మీకొక ఉపదేశం చేస్తాడు అని చెబుతుంది. కుంతి, ధర్మరాజు చెప్పిన మీదట భీముడు హిడింబిని స్వీకరిస్తాడు, కానీ సంతానం పుట్టినవరకే




ఆమెతో ఉంటానని అంటాడు. పాండవులు శాలిహోత్ర ఆశ్రమానికి వెళతారు. ఆ ఆశ్రమం దగ్గరలో ఉన్న కొలనులో స్నానమాడి, ఆ నీటిని త్రాగుతారు. దానితో వారికి ఆకలి బాధలుండవు. అలాగే అక్కడున్న ఒక మహావృక్షం కింద పడుకుంటారు. దానివలన ఎండా, వాన, చలి బాధలుండవు. కొన్ని రోజులకి వేద వ్యాసుడు వచ్చి, మీరు బ్రాహ్మణ వేషధారులై, ఏకచక్రపురం వెళ్ళమంటాడు.

కొన్ని రోజులకి భీమునికి, హిడింబికి ఘటోత్కచుడు పుడతాడు. అతడు తల్లిని తీసుకుని దూర ప్రదేశానికి వెళ్ళిపోతాడు. కొన్నిరోజులకు పాండవులు ఏకచక్రపురం వెళతారు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.**

**పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**






# రక్తదానమంటే ప్రాణదానమే

**- ఆర్డీఓ మలోల**

నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఈనెల 12న 'ఐ లవ్‌యు ఫౌండేషన్' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఆర్డీఓ మలోల పాల్గొని రక్తదానమంటే బాధితులకు ప్రాణదానం చేయడమేనన్నారు. ఈ కార్యక్రమానికి యువత-రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయడం సంతోషకరమంటూ వారిని అభినందించారు.

# డిసిసిబి ఏటిఎం ప్రారంభం



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న తడికల బజార్ సెంటర్‌లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డిసిసిబి) ఆధ్వర్యంలో ఏటిఎం సెంటర్‌ను ఏర్పాటుచేశారు. డిసిసిబి సిఇఓ శంకర్‌బాబు దీనికి ప్రారంభోత్సవం చేశారు. తమ బ్యాంకు ఖాతాదారుల సౌకర్యార్థం దీనిని నెలకొల్పడం జరిగిందన్నారు. బ్యాంకు జిఎం సరిత, ఆప్కాబ్ అధికారి శ్రీనివాస్, ఏజీఎం మధుసూదన్‌రావు, డిసిసిబి స్టోన్‌హౌస్‌పేట శాఖ మేనేజర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# ఘంటసాల 'స్వరాభిషేకం'



మధురగాయకుడు దివంగత ఘంటసాల వెంకటేశ్వరరావును స్మరించుకుంటూ నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో ఈనెల 12న స్థానిక గ్రీన్‌ఫోర్డ్స్ ట్రస్ట్, కృష్ణ కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఘంటసాల స్వరాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. తొలుత నిర్వాహకులు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసిన, ఘంటసాల స్మారకంగా చిన్నారులకు నృత్యపోటీలు, పాటల పోటీలు నిర్వహించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, న్యాయవాది రమాదేవి, మురళీకృష్ణ, రవి తదితరులు పాల్గొని, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# మన సతీష్‌రెడ్డికి.. అమెరికాలో ఆత్మీయ సన్మానం

## డల్లాస్‌లో మిత్రులు, నెల్లూరీయుల అభినందనల వెల్లువ



**విఖ్యాత శాస్త్రవేత్త, భారత రక్షణ రంగ సాంకేతిక సలహాదారు, మన నెల్లూరీయుడు డాక్టర్ గుండ్రా సతీష్ రెడ్డికి ఇటీవల అమెరికాలోని 'డల్లాస్' వేదికగా అపూర్వమైన రీతిలో ఆత్మీయ సత్కారం జరిగింది. అమెరికాలో ఉంటున్న నెల్లూరీయులు, అనేకమంది సంఘాల వారు, పలువురు ప్రముఖులు పాల్గొని సతీష్‌రెడ్డి ప్రజ్ఞాపాటవాలను, దేశానికి ఆయనందిస్తున్న సేవలను ప్రస్తుతించి సన్మానించారు. మన నెల్లూరీయుడు, మన తెలుగు వాడు దేశంలోనే గొప్ప శాస్త్రవేత్తగా రాణిస్తుండడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, పండుగ వేడుకలా జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం అద్భుతంగా జరిగింది.**

ఇటీవల అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఉన్న డల్లాస్‌లో 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం ఎంతో వేడుకగా జరిగింది. కేంద్ర రక్షణమంత్రిత్వశాఖ సలహాదారు, డిఆర్‌డిఓ పూర్వ ఛైర్మెన్, ఎంతో ప్రఖ్యాతమైన 'హోమీబాబా స్మారక స్వర్ణపతకం' వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డులను, అభినందనలను అందుకున్న మన నెల్లూరీయుడు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డికి ఆత్మీయ సత్కారం జరిగింది. సతీష్‌రెడ్డితో పాటు చదువుకున్న మిత్రులు, ప్రస్తుతం డల్లాస్‌లో ఉన్న రంగారావు, శ్రీనివాసరాజు, బి.శ్రీనివాసమూర్తితో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన డి.శ్రీనివాసమూర్తి, శీనప్ప, శ్రీనివాసులు, రామారావు, రమణారావు, భక్త, రమణప్రసాద్ తదితరులు మాట్లాడుతూ డాక్టర్ సతీష్‌రెడ్డితో తమకున్న ఆత్మీయానుబంధాన్ని గుర్తుకు తెచ్చుకుని మురిసిపోయారు. మహనీయులు డాక్టర్ అబ్దుల్‌కలాం వంటివారితో కలిసి పనిచేసే అదృష్టం సతీష్‌రెడ్డికి దక్కడం విశేషమని, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన రంగాల్లో సతీష్‌రెడ్డి ప్రతిభాపాటవాలు అనన్యసామాన్యమని వారు కీర్తించారు. నెల్లూరుజిల్లాలోని ఆత్మకూరు తాలూకాలో మారుమూల గ్రామమైన మహిమలూరులో జన్మించిన సతీష్‌రెడ్డి, శాస్త్రవేత్తగా అత్యద్భుత ప్రజ్ఞతో ఎంతో ఎత్తుకు ఎదిగారన్నారు. డాక్టర్ సతీష్‌రెడ్డి వంటివారికి జన్మనిచ్చిన మహిమలూరు మహిమ అలాంటిదని అంటూ, ఆయన తల్లితండ్రులు, ఆ గ్రామస్తులందరికీ సతీష్‌రెడ్డి ఘనకీర్తి తెచ్చిపెట్టారన్నారు.

### 'భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి

చిన్నప్పటినుంచి ఆయనెంతో కష్టపడి చదువుకుని, క్రమశిక్షణతో -పట్టుదలతో రాణించి నేడు దేశంలోనే ఒక గొప్ప శాస్త్రవేత్తగా ఎదగడం మనందరికీ గర్వకారణం'..అంటూ సతీష్‌రెడ్డితో పాటు చిన్నతనం నుంచి చదువుకున్న స్నేహితులు, ఆత్మీయులు, పలువురు ప్రముఖులు సతీష్‌రెడ్డిని ఈ సందర్భంగా అందరూ ప్రశంసలతో ముంచెత్తారు. 'నాటా' ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి కొర్సపాటి మాట్లాడుతూ, డాక్టర్ సతీష్‌రెడ్డి మన తెలుగుతేజం అని కొనియాడారు. దేశానికి సతీష్‌రెడ్డి చేస్తున్న సేవలు అపూర్వమన్నారు. త్వరలో డల్లాస్‌లో జరగబోయే నాటా సభలకు సతీష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనాలంటూ సతీష్‌రెడ్డిని ఆహ్వానించారు. అనంతరం అమెరికాలోని ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం టాంటెక్స్, తానా, నాటా, నాట్స్ వంటి సంస్థల ప్రతినిధులు డాక్టర్ సతీష్‌రెడ్డిని గజమాల, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. డాక్టర్ సతీష్‌రెడ్డి ఆత్మీయ సత్కారాన్ని పండుగ సంబరంగా జరిపిన నాటా అధ్యక్షులు కొర్సపాటి శ్రీధర్‌రెడ్డిని, ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం పూర్వ అధ్యక్షులు కృష్ణారెడ్డి ఉప్పలపాటిని అందరూ అభినందించారు. ఎన్ఆర్ఐ ప్రముఖులు చిల్లకూరు గోపిరెడ్డి, అజయ్ కలువ, ఉప్పలపాటి కృష్ణారెడ్డి, రామకృష్ణ, ప్రదీప్‌రెడ్డి, బలరాం, భీమా, భాస్కర్‌రెడ్డి, సురేష్ మండువ, డాక్టర్ నరసింహా రెడ్డి ఊరిమిండి, డాక్టర్ అరుణజ్యోతి కోలా, గోవర్ధనరావు నిడిగంటి తదితరులు పాల్గొన్నారు.


### అబ్దుల్‌కలాం ప్రేరణ... - సతీష్‌రెడ్డి

తానింతస్థాయికి ఎదగడం వెనుక భారత మాజీ రాష్ట్రపతి, విఖ్యాత శాస్త్రవేత్త, దివంగత అబ్దుల్‌కలాం ప్రేరణే ముఖ్యమని, వారి మార్గదర్శకాన్ని మరచిపోలేనని డాక్టర్ సతీష్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఆ మహనీయుని మార్గదర్శకంలో మొదలుపెట్టిన క్షిపణి వ్యవస్థ అనంతరం ఎందరో శాస్త్రవేత్తల కృషితో ఎంతో అభివృద్ధి చెంది భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా రూపొందుతోందన్నారు. భారత్ గత ఎనిమిదేళ్లలో కొత్తపుంతలు తొక్కుతోందని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో..ప్రత్యేకించి దేశ రక్షణకు అవసరమైన సైనిక తుపాకులు, బాంబులు, అగ్ని-ప్రళయ-బ్రహ్మోస్ వంటి క్షిపణులు, తేజస్ వంటి యుద్ధ విమానాలు,ఐఎన్ఎస్ విక్రాంత్ తదితర యుద్ధనౌకలు, చిన్న మందుగుండు సామగ్రి నుంచి భూతల, గగన తల, సముద్ర అంతరిక్ష సంబంధ ఆయుధ సంపత్తి వరకు నేడు దేశీయంగానే తయారుచేస్తే స్వయంసమృద్ధి దిశగా దూసుకుపోతోందన్నారు. రానున్న కాలంలో భారత్ విదేశాలకు కూడా ఆయుధసంపత్తిని అందజేసే శక్తిసామర్థ్యాలను సంతరించుకుంటోందన్నారు. భారత్‌లో పెద్దఎత్తున జరుగుతున్న శాస్త్ర సాంకేతిక పరిశోధనా పురోగతి, మౌలికవసరుల సౌలభ్యం కారణంగా గత అయిదేళ్ళ నుంచి విదేశాలకు వెళ్ళే యువత సంఖ్య బాగా తగ్గిందన్నారు. ఎక్కువమంది భారత్‌లోనే ఉండి పనిచేయడానికి ఇష్టపడుతున్నారన్నారు. కోవిడ్ మహమ్మారి విరుచుకుపడిన తరుణంలో ప్రధాన నరేంద్రమోదీ ఆదేశాలతో, తాము డిఆర్‌డిఓ ఛైర్మెన్‌గా ఉండగా కోవిడ్ బాధితుల కోసం డిఆర్‌డిఓ వెంటిలేటర్లను, ఆక్సిజన్ వగైరాలను యుద్ధప్రాతిపదికన స్వయంగా ఉత్పత్తిచేయడంతో పాటు, అన్ని సదుపాయాలను ఏర్పాటుచేయడం గొప్పవిషయమన్నారు. భారత్‌ను మరింత బలోపేతం చేసేందుకు ఎన్ఆర్ఐలు తమవంతు పాత్రను పోషించాలని సతీష్‌రెడ్డి కోరారు.

*భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో ఘన విజయం సాధించింది. చిన్న ఉపగ్రహ వాహకనౌకను అంతరిక్ష కక్షలోకి చేర్చి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈనెల 10న ప్రయోగించిన ఎస్ఎస్ఎల్‌వి-డి2 షార్‌కు మరింత ఖ్యాతిని తెచ్చిపెట్టింది. తక్కువ ఖర్చుతో అంతరిక్ష ప్రయోగాలు చేయడంలో ఇస్రో తన సత్తా చాటుకుంది. దీంతో భారత్ కీర్తిపతాక నింగిలో మరోసారి రెపరెపలాడింది.*

# మరో విజయం

- నింగిలోకి దూసుకెళ్లిన..చిన్న రాకెట్
- ఎస్ఎస్ఎల్‌వి-డి2 జయప్రదం



తక్కువ సమయంలోనే, తక్కువ ఖర్చుతోనే భారత అంతరిక్ష శాస్త్రవేత్తలు సరికొత్తగా రూపొందించిన ఎస్ఎస్ఎల్‌వి-డి2 రాకెట్ విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు భారతప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 10వ తేది శుక్రవారం ఉదయం 9-18 గంటలకు ఇస్రోకి చెందిన ఎస్ఎస్ ఎల్‌వి-డి2 రాకెట్ నింగిలోకి దూసుకుపోయింది. ఇస్రో అధిపతి డాక్టర్ సోమనాథ్ ఆధ్వర్యంలో, శాస్త్రవేత్తల నిశిత పర్యవేక్షణలో ఇఓఎస్-07 ఉపగ్రహంతో పాటు అమెరికా అంటారిస్‌కు సంస్థకు చెందిన 11.5 కిలోల జానుస్-1, చెన్నై స్పేస్ క్విడ్జ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన 8.7 కిలోల ఆజాదీ శాట్ -2లను మన శాస్త్రవేత్తలు భూమికి 250 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో దిగ్విజయంగా ప్రవేశపెట్టారు.

### 5 రోజుల వ్యవధిలోనే రాకెట్ రూపొందించారు

కేవలం 5 రోజుల వ్యవధిలోనే ఈ రాకెట్‌ను రూపొందించడం విశేషం. 34మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 119 టన్నుల బరువున్న ఈ రాకెట్ ప్రయోగం 15.38 నిమిషాల్లో పూర్తయింది. గతంలో ప్రయోగించిన ఎస్ఎస్ఎల్‌వి-డి1 ప్రయోగం విఫలం కావడంతో శాస్త్రవేత్తలు మరింత శ్రద్ధపెట్టి ఈ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు. వాణిజ్యపరంగా ఇలాంటి రాకెట్లు ఎంతో ఉపకరిస్తాయంటున్నారు. ఉపగ్రహాలను గగనతలంలోని నిర్దేశిత కక్షల్లో ప్రవేశపెట్టేందుకు ఈ రాకెట్లు బాగా ఉపయోగపడతాయని శాస్త్రవేత్తల నమ్మకం. భూమిపైనా, సముద్రాల్లోని వాతావరణ మార్పులను గుర్తించేందుకు, భవిష్యత్తులో ఉపగ్రహ ప్రయోగాలకు ఇఓఎస్-07 ఉపగ్రహం ఎంతగానో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఏదేమైనా, ఈ బుల్లి రాకెట్ సక్సెస్ కావడం మరిన్ని ప్రయోగాలకు స్ఫూర్తినిస్తుందనడంలో సందేహం లేదు.




# పథకాల అమలులో.. నెల్లూరు భేష్

**- జాతీయ పర్యవేక్షక కమిటీ సభ్యుల ప్రశంస**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న అనేక పథకాల అమలులో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా పనితీరు చాలా బాగుందని జాతీయ పర్యవేక్షక కమిటీ సభ్యులు అంబటి శ్రీనివాసరావు, కిరణ్ అభినందించారు. దాదాపు పది రోజులపాటు వారు జిల్లాలోని వివిధ గ్రామాల్లో పర్యటించి పథకాల అమలు ఎలా జరుగుతోందో నిశితంగా పరిశీలించారు. అనంతరం ఈనెల 13న నెల్లూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో తాము పరిశీలించిన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పింఛన్లు, ఉపాధి హామీ, స్వయం సహాయక బృందాల పనితీరుపై లబ్దిదారులతో ముఖాముఖిగా మాట్లాడి, అనేక పథకాల అమలు తీరును పరిశీలించినట్లు కలెక్టర్‌కు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న అనేక పథకాల పనితీరు జిల్లాలో చాలా బాగుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.





ఫిబ్రవరి13వ తేదీ తాడేపల్లిలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## ఘనంగా జడ్పీ పాఠశాల శతాబ్ది ఉత్సవాలు



గూడూరు పట్టణంలోని జడ్పీ పాఠశాల శతాబ్ది ఉత్సవాలను ఈ నెల 12వ తేదీ ఘనంగా నిర్వహించారు. పూర్వవిద్యార్థులు కుటుంబసభ్యులతో హాజరై సందడి చేశారు. ముఖ్యఅతిథిగా నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొని మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు అందరూ ఒకే వేదికపై వచ్చి పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం సంతోషదాయకమన్నారు. తనవంతుగా పాఠశాలకు తోడ్పాటునందిస్తానని చెప్పారు. వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దడంలో పెళ్లకూరు దశరథరామిరెడ్డి దాతృత్వం మరువలేనిదని కొనియాడారు. అనంతరం 100 సంవత్సరాల పైలాన్‌ను ఆవిష్కరించి విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, హెచ్‌ఎం రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం




లయన్స్ జిల్లా గవర్నర్ రామచంద్ర ప్రకాష్‌రావు ఇటీవల గూడూరు లయన్స్ క్లబ్ వారు నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. తొలుత జిల్లా పరిషత్ బాలురు పాఠశాలను సందర్శించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేసి, లయన్స్ క్లబ్ సమకూర్చిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మెటీరియల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులకి అందించారు. అనంతరం సరస్వతీ శిశు మందిరంలోని నిరుపేదలకు పలసరుకులు, పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామచంద్ర ప్రకాష్ గూడూరు లయన్స్ క్లబ్ ద్వారా గత 55 సంవత్సరాలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఆయన వెంట అధ్యక్షులు కళ్యాణ సాయి, డిస్ట్రిక్ట్ ఛైర్మన్లు షేక్ రియాజ్ అహ్మద్, మురళిరెడ్డి, రామ్మోహన్, రీజనల్ ఛైర్మన్ శ్రీరాములు, జోన్ ఛైర్మన్ కామాక్షిదేవి, లయన్స్ సభ్యులు రూపేష్‌రెడ్డి, రవిచంద్రరెడ్డి, మదనమేటి రమణయ్య, ఇషాక్, మునికుమార్, దయాల్, రవీంద్రకుమార్, రామచంద్రయ్య, సోమిశెట్టి చెంచురామయ్య, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్న వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



గూడూరు బాలాజీనగర్‌లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల ఆలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు స్నపన తిరుమంజనం, చక్రస్నానం జరిపారు. అనంతరం హోమం, పూజలు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్లు, ఆలయ అర్చకులు యోగానందస్వామి పాల్గొన్నారు.

# సుస్థిర అభివృద్ధే పునాదిగా..శ్రీసిటీ

### - భారత్-జపాన్ వ్యాపార సహకార సమావేశంలో డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి




సుస్థిర అభివృద్ధి పునాదులుగా శ్రీసిటీ నిర్మించబడిందని, పర్యావరణ, సామాజిక-ఆర్థిక అంశాలలో రాజీపడకుండా ఈ ప్రాంత ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చడానికి శ్రీసిటీ ద్వారా నిరంతర కృషి జరుగుతోందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చెప్పారు. ఇటీవల న్యూఢిల్లీలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌ఐసిసిఐ), జపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (జెసిసిఐ) భాగస్వామ్యంతో భారత్-జపాన్ వ్యాపార సహకార కమిటీ (ఐజెబిసిసి) 46వ సంయుక్త సమావేశం జరిగింది. 'భవిష్యత్ తరానికి సుస్థిర సమాజంపై సహకారం' అనే అంశంపై సమావేశంలో డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సుస్థిరత'.. జీవన నాణ్యతను బాగా మెరుగుపరుస్తుందని, సామాజిక-ఆర్థిక శ్రేయస్సు, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల రక్షణకు దారితీస్తుందని, తద్వారా మన భవిష్యత్ తరాలకు భద్రత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. 'వర్క్-లివ్-లెర్న్- ప్లే' అనే సూత్రంపై అభివృద్ధి చేయబడిన శ్రీసిటీ పారిశ్రామిక నగరంలో స్వచ్ఛమైన గాలి, కళకళలాడే పచ్చదనం, గ్రామీణ వాతావరణంలో పట్టణస్థాయి వసతులు లభించడం చూడవచ్చన్నారు. జపాన్ కంపెనీలకు భారతదేశం అత్యంత ప్రియమైన వ్యాపార గమ్యస్థానంగా ఆవిర్భవించిందని, భారత్- జపాన్ దేశాల మధ్య పటిష్ట వ్యాపార భాగస్వామ్య సంబంధాలున్నాయని ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారత్‌లోని జపాన్ రాయబారి హిరోషి సుజుకీ తెలిపారు. ప్రస్తుత తరంతో పాటు, భావి తరాల కోసం ప్రపంచాన్ని పరిశుభ్రంగా పచ్చగా మార్చే దిశగా భారత్-జపాన్ భాగస్వామ్యానికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించే ధ్యేయంతో నిర్వహించిన ఈ సమావేశంలో, కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) కార్యదర్శి అనురాగ్ జైన్‌తో పాటు భారత్-జపాన్ దేశాలకు చెందిన పలువురు వ్యాపారవేత్తలు పాల్గొని మాట్లాడారు.

## ప్రభుత్వ హైస్కూళ్లకు 'టిహెచ్‌కె' కంపెనీ వితరణ

**• 16 లక్షల విలువైన 12 బోర్డులు పంపిణీ**



శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన, అధునాతన విద్యను అందించే ప్రయత్నంలో, తమ కార్పొరేట్ సామాజిక చర్యల్లో భాగంగా శ్రీసిటీలోని టిహెచ్‌కె ఇండియా పరిశ్రమ 3 ప్రభుత్వ స్కూళ్లకు స్మార్ట్ డిస్ప్లే బోర్డులను వితరణగా ఇచ్చింది. ఇటీవల నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో మాదనపాలెం ఉన్నత పాఠశాలకు రెండు, చెరివి ప్రాథమికోన్నత పాఠశాలకు ఒకటి, ఇరుగుళం ఉన్నత పాఠశాలకు 5 బోర్డులను కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఘసాకు ఇషిహార విద్యార్థులు, ఉపాధ్యాయులు, శ్రీసిటీ ఫౌండేషన్, టిహెచ్‌కె సిబ్బంది సమక్షంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందచేశారు. ప్రభుత్వ పాఠశాలలకు టిహెచ్‌కె పరిశ్రమ సహకారాన్ని ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు. తన కార్పొరేట్ సామాజిక బాధ్యత 'సిఎస్ఆర్' నిధుల కింద కంపెనీ రూ.16 లక్షల వ్యయంతో 4 పాఠశాలలకు 14 స్మార్ట్ బోర్డులను వితరణగా ఇస్తోందని, ప్రస్తుతం మూడు స్కూళ్లకు 8 బోర్డులు పంపిణీ చేయగా, మరో హైస్కూల్ కు 6 బోర్డులు ఇవ్వనుందని పేర్కొన్నారు.

### శ్రీసిటీలో 18న..

## సంగీత గేయధార



శ్రీసిటీలోని 'శ్రీవాణి' ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 18వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రముఖ సారస్వతవేత్త, వెంకటగిరి రాజా డా.విబి సాయికృష్ణ యాచేంద్ర 'సంగీత గేయధార' కార్యక్రమం ఉంటుందని, సంగీత సాహిత్యాభిమానులందరూ పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

### సైబర్ నేరాలపై

## అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుత ఆధునిక టెక్నాలజీ ద్వారా ఇటీవలకాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలందరూ ఈ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని క్రైమ్ బ్రాంచ్ సిఐ రామచంద్రారెడ్డి కోరారు. గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో గూడూరు రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై తీసుకోవాల్సి జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై జాగ్రత్తలు తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవలకాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, తెలియని నెంబర్ల నుండి సెల్‌ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చినప్పుడు వాటి పూర్తి వివరాలు తెలుసుకుని, అప్రమత్తంగా ఉండి వాటి లింకులు ఓపెన్ చేయవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ జి.దశరథరామారావు, ఎస్సై బ్రహ్మనాయుడు, నరసింహరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధే లక్ష్యం

గూడూరు పురపాలక సంఘంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు పారిశుద్ధ్యం నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తామని, ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలయ్యేలా చూస్తామని కమిషనర్ తోట సాయినాథ్ తెలిపారు. ఇప్పటివరకు సుమారు 5 టన్నుల ప్లాస్టిక్‌ని సీజ్ చేసి రూ.40వేల వరకు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.

## పొదుపు సొమ్ము స్వాహాపై ఆందోళన



గూడూరు పురపాలక సంఘం పరిధిలోని చెన్నూరులో సభ్యులతో సంతకాలు చేయించి వీవోఏ లక్ష్మి రూ.40 లక్షల వరకు స్వాహా చేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలని బాధిత సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు నగదు ఇప్పిస్తామని సంతకాలు చేయించుకొని అధిక మొత్తం డ్రా చేసిందని, అనంతరం ప్రశ్నించడంతో ఊరు విడిచి వెళ్లిపోయిందని, వెలుగు అధికారులకు, పోలీసులకు తెలిపినా పట్టించుకోలేదని, ఉన్నతాధికారులు న్యాయం చేయాలని విన్నవించారు. బాధిత సభ్యులు సంపూర్ణమ్మ, మల్లేశ్వరి, వరలక్ష్మి, లీలావతి, మాధవి, రత్నమ్మ, రాధిక, లలిత పాల్గొన్నారు.

# కోవూరులో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కోవూరులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రకాశం-నెల్లూరుజిల్లా జట్ల మధ్య పోటాపోటీగా జరిగిన తుదిపోరులో ప్రకాశం జిల్లా జట్టు 5 పాయింట్ల ఆధిక్యతతో విజేతగా నిలిచి ప్రథమ బహుమతి సాధించింది. నెల్లూరుజిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల జట్లు తృతీయ, చతుర్ధ స్థానాలు సాధించాయి. ఈ పోటీల్లో 8 జిల్లాలకు చెందిన కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. ఈనెల 13న జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో డిఏబి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, కోవూరు సిఐ రామకృష్ణారెడ్డి పాల్గొని విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్



కార్యదర్శి వీర్ల అంకయ్య, ఉపాధ్యక్షులు రంగారావు, బాలస్వామి, జిల్లాశాఖ కార్యదర్శి లవకుమార్, విజయబాబు, జాన్సన్, విజయానందం, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## 'యువనర్తన' ఆశ్రితా



నెల్లూరుకు చెందిన ప్రముఖ నృత్యకళాకారిణి మొయిళ్ళ ఆశ్రితారెడ్డికి ఇటీవల చింతా రామమూర్తి యువనర్తన పురస్కారం లభించింది. ఈ సందర్భంగా నెల్లూరులోని టౌన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో నగర కార్పొరేషన్ కమిషనర్ హరిత చేతులమీదుగా ఆశ్రితారెడ్డి ఈ పురస్కారం అందుకుంది. ప్రముఖ నాట్యాచార్యుడు దేగల సాంబశివరావు, వేదాంతం రాధేశ్యామ్, రామలింగశాస్త్రి లతో పాటు జిల్లా వైకాపా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి తదితరులు పాల్గొన్నారు.

## 'నెరసం' రాష్ట్రస్థాయి ఉగాది కవిసమ్మేళనం

రానున్న శోభకృత్ నామ ఉగాది పర్వదినం సందర్భంగా మార్చి 26వ తేదీన నెల్లూరుజిల్లా రచయితల సంఘం (నెరసం) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉగాది కవిసమ్మేళనం నిర్వహించనున్నామని, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కవులను ఆహ్వానిస్తున్నామని నెరసం అధ్యక్ష కార్యదర్శులు ఏ.జయప్రకాష్, డా.పాతూరి అన్నపూర్ణ తెలిపారు. స్థానిక టౌన్‌హాలులో జరిగే ఈ కవిసమ్మేళనంలో పాల్గొను కవులు, కవయిత్రులు తమ పేర్లను ఫిబ్రవరి 25వ తేదీ లోగా ఫోన్ నెం.9440088482లో కానీ, వాట్సాప్ ద్వారా కానీ నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉగాది రోజున ఉదయం 9 నుంచి కవిసమ్మేళనం ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు జరుగుతుందని, ముందుగా తమ పేర్లు నమోదు చేసుకున్న కవులకే మెమొంటో, శాలువతో సన్మానం ఉంటుందని తెలిపారు.

## పెరుగుకు.. గ్రీస్ ప్రశంసా పురస్కారం



నెల్లూరుకు చెందిన కవి పెరుగు రామకృష్ణకు గ్రీకు భాషా సాంస్కృతిక అవార్డు లభించింది. ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా గ్రీకు భాషతో అనుబంధం ఉన్న వివిధ దేశాల కవులతో జరిగిన ఇంటర్‌నెట్ సమావేశంలో ఆయన పాల్గొన్న సందర్భంగా ఈ అవార్డు వచ్చింది. 2011లో గ్రీస్ దేశాన్ని సందర్శించి వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పోయెట్స్ కార్యక్రమంలో పాల్గొనడం, ఆయన రాసిన పలు కవితలు గ్రీక్ భాషలోకి అనువాదం అయివుండడం విశేషం. పెరుగుకు ఈ అరుదైన అవార్డు లభించినందుకు పలువురు కవులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## నలుగురు బాలకార్మికులకు విముక్తి

'ఆపరేషన్ స్వేచ్ఛ' కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగరంలోని పలుప్రాంతాల్లో ఇటీవల యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టియు), జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ, కార్మికశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. నగరంలోని సంతపేట పెన్నా వారధి సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న నలుగురు బాలలకు విముక్తి కలిగించి, వారి తల్లితండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ పిల్లలను చదివించాలని గట్టిగా చెప్పారు. బాలల చేత పనిచేయిస్తున్న ఇటుక బట్టీ యజమానిపై కేసు పెట్టాలని పోలీసులకు చెప్పారు.

## గండవరంలో.. వేడుకగా

## ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రం.. కొడవలూరు మండలంలోని గండవరంలో ఉన్న గంగా పార్వతీ సమేత శ్రీ ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. 14న అంకురార్పణ, 15న ధ్వజారోహణ, 16న సింహవాహనోత్సవం, 17న రావణసేవ వేడుకగా జరిగాయి. 18న మహాశివరాత్రి రోజున గిన్నెభిక్ష ఉత్సవం జరుగనుంది. 19న కళ్యాణోత్సవం, గజవాహనోత్సవం జరుగనున్నాయి. 20న జరిగే రథోత్సవానికి జిల్లావ్యాప్తంగా భక్తులు వేలసంఖ్యలో తరలివస్తారు. 21న వసంతోత్సవం, అశ్వవాహనోత్సవం, 22న ఏకాంతసేవ జరుగుతాయి. ఇప్పటికే గండవరానికి ఆర్టీసి ప్రత్యేక బస్సులు కూడా నడుపుతోంది. దీంతో భక్తులు నిత్యం గండవరం తరలి వెళ్ళి, ఉదయకిరణాలతో దేదీప్యమానంగా ప్రకాశించే శ్రీ ఉదయకళేశ్వరస్వామివారిని దర్శించుకుని తరిస్తున్నారు.

## ఏబివిపి శోభాయాత్ర

అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబివిపి) వజ్రోత్సవాలను పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు నగరంలో ఏబివిపి ఆధ్వర్యంలో పెద్దఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన విద్యార్థి సమ్మేళనంలో ఆర్ఎస్ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్ పుట్టా శేషు పాల్గొని మాట్లాడారు. ఏబివిపి ఏర్పడి 75 సంవత్సరాలైందని, విద్యార్థి దశ నుంచే యువతలో దేశభక్తిని, నైతిక విలువలను పెంపొందించేందుకే ఏబివిపి ఏర్పడిందని, విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి ఏబివిపి కృషిచేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఏబివిపిని మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. పరిషత్ జాతీయ కార్యదర్శి హరికృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, వర్కింగ్ కమిటీ సభ్యుడు సాయికృష్ణారెడ్డి, జిల్లా కన్వీనర్ అశోక్‌రెడ్డి, నగర కార్యదర్శి యశ్వంత్, చందు తదితరులు పాల్గొన్నారు. తొలుత శోభాయాత్ర పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు.

## కైలాసనాథేశ్వరస్వామికి మహాశివరాత్రి పూజలు



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం గ్రామంలో కొలువైవున్న శ్రీ కామాక్షితాయి సమేత కైలాసనాథేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈనెల 18న పెద్ద ఎత్తున స్వామివారికి పూజలు, సేవలు జరుగనున్నాయి. ఆరోజు వేకువ నుంచి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కలశాభిషేకంతో పాటు స్వామివారికి-అమ్మవారికి చందనాలంకారం మహోత్సవం నిర్వహిస్తామని, అనంతరం పూలంగిసేవ, ఉదయం 7 గంటల నుండి అర్చనలు ఉంటాయని, ఆ తర్వాత ఉదయం 10 గంటల నుంచి కళ్యాణోత్సవం చేస్తామని ఆలయ ఛైర్మెన్ కట్టా సుబ్రహ్మణ్యం, ఇఓ కుడారి పెంచలవర ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 1 గంట నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 4.30 గంటలకు అర్చనలు, రాత్రి 7 గంటలకు బిల్వార్చన, దేవీఖడ్గమాల పూజలు, నివేదన, రాత్రి 11.45 గంటలకు లింగోద్భవ కాలం సందర్భంగా స్వామివారికి విశేషపూజలు, రాత్రి 12.30 గంటల నుంచి స్వామివారికి 'నందిసేవ' గ్రామోత్సవం వైభవంగా జరుగుతాయని, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకోవాలని వారు కోరారు.

## టూకీగా...



### నర్రవాడ వెంగమాంబాదేవి ఆలయానికి రూ.11లక్షల రాబడి

జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయం, దుత్తలూరు మండలం నర్రవాడలోని శ్రీ వెంగమాంబాదేవి పేరంటాలు అమ్మవారి దేవస్థానానికి గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 13వ తేది వరకు భక్తులు హుండీల్లో వేసిన కానుకలను ఈనెల 13న లెక్కించగా, మొత్తం రూ.11,06,255 లు రాబడి వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

### పశుసంవర్ధకశాఖ.. ఇన్‌చార్జి జేడీగా రమేష్‌నాయక్

పశుసంవర్ధకశాఖ జిల్లా ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ (జేడీ)గా కావలి డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌నాయక్ నియమితులయ్యారు. జేడీ మహేంద్రుడు దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళడంతో ఆయన వచ్చేవరకు ఇన్‌చార్జి బాధ్యతలను ఆయన నిర్వహించనున్నారు.

### 'అపస్' రాష్ట్ర మహాసభలు.. మార్చి 5 నుంచి

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) ఆధ్వర్యంలో మార్చి 5-6 తేదీల్లో నెల్లూరులో ఆ సంఘం మహాసభలు పెద్దఎత్తున జరుగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఆ మేరకు మహాసభల గోడపత్రికలను ఈనెల 14న డిఇఓ గంగా భవాని ఆవిష్కరించారు. 'అపస్' జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచార్యులు, కార్యదర్శి చంద్రమౌళి పాల్గొన్నారు.

### మనుబోలులో.. మెగా ఉచిత వైద్యశిబిరం

మనుబోలు హైస్కూలులో గుండెజబ్బులు, కంటివ్యాధుల నివారణకు ఈనెల 12న మెగా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ గుండెవ్యాధుల నిపుణులు డాక్టర్ మాలేపాటి బాలకృష్ణ, నేత్రవైద్య నిపుణురాలు డాక్టర్ శిరీష పాల్గొని చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెడ్మాస్టర్ దేవిడ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

### కోడిపందాలపై పోలీసుల దాడి

ఆత్మకూరు మండలంలోని బోయలచిరువెళ్ళ గ్రామ శివార్లలో ఉన్న బొగ్గేరు వద్ద ఇటీవల కోడిపందాలు నిర్వహిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు కోళ్ళను, 1200 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఆత్మకూరు ఎస్ఐ శివశంకరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన

మాదకద్రవ్యాలు ఎంతటి ప్రమాదకరమో కొండాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కొండాపురం ఎస్ఐ ఖాజావలి ఈనెల13న అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటిని వాడినా, కలిగివున్నా, విక్రయించినా నేరమని, విద్యార్థులు ఇలాటి దురలవాట్ల జోలికి వెళ్లొద్దన్నారు. ప్రిన్సిపాల్ శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

### పల్లిపాడు..గాంధీ ఆశ్రమంలో సరోజినినాయుడు జయంతి

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని చరిత్రాత్మకమైన పినాకిని గాంధీజీ ఆశ్రమంలో ఈనెల 13న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినినాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. కోర్‌కమిటీ సభ్యురాలు మంజుల సరోజినినాయుడు దేశానికి చేసిన సేవలను ప్రస్తుతించారు.

### వల్లూరు పశువైద్యశాలలో రికార్డుల తనిఖీ

ముత్తుకూరు మండలం వల్లూరులో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్యశాలను ఈనెల 13న ఆ శాఖ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సురేష్ ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రి పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పశువైద్య నిపుణురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి, గోపాలమిత్ర మురళి తదితరులు పాల్గొన్నారు.

### సైదాపురంలో ఉపాధిహామీపై సమీక్ష

మండల కేంద్రమైన సైదాపురంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఈనెల 14న ఉపాధి హామీ పథకంపై ఏపీడీ శ్రీహరి సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సిబ్బందికి చెప్పారు. ఎంపిడిఓ ఎం. వెంకటేశ్వర్లు, ఏపీఓ మురళి పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!




నెల్లూరులోని ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ ఎం.జి.రవి కుమార్తె ఐశ్వర్య - అరుణ్‌ల కళ్యాణం ఫిబ్రవరి 9వ తేదీ నెల్లూరులోని పావని గార్డెన్స్ నందు వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు, సంతపేట వాస్తవ్యులు మెంటా రామమోహనరావు - వెంకటలక్ష్మీ నివాసల కుమార్తె సునందిని దేవి - జగదీష్ (కడప వాస్తవ్యులు పాలాది సుబ్బారావుశ్రేష్ఠి - లక్ష్మీకాంతమ్మల కుమారుడు)ల పరిణయం ఫిబ్రవరి 10వ తేదీ పెంచలకోనలో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

## ఆదాలకు కిలివేటి శుభాకాంక్షలు



వైకాపా నెల్లూరు రూరల్ నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఇటీవల ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య. ఈ సందర్భంగా ఇరువురు జిల్లా రాజకీయ పరిస్థితులపై ముచ్చటించుకున్నారు.

## లోకేష్‌కు సంఘీభావం



'యువగళం' పాదయాత్రలో భాగంగా ఎస్ఆర్‌పురం మండలం, కొత్తూరులో పర్యటిస్తున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి సంఘీభావం తెలియజేస్తున్న కర్ణాటక టిడిపి కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి. ఈ సందర్భంగా వారిరువురు ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం గురించి కొద్దిసేపు చర్చించారు.

# ఇదేం బాదుడు.. ఇదేం ఖర్మ?

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీలోనే వినపడుతుండడంతో రాజకీయవర్గాలు ముక్కున వేలేసుకుంటున్నాయి. లోకేష్ చేపట్టిన పాదయాత్రకు సంబంధించి రోజువారీ ఖర్చులన్నీ ఆయా నియోజకవర్గాల పార్టీ ఇన్‌ఛార్జీలే పెట్టుకోవాలన్న నిబంధనపెట్టారని వినికిడి. పాదయాత్రకు వచ్చే జనం, యాత్ర ఆసాంతం కొనసాగే విధానం, యాత్ర విజయవంతం కావడానికి సదరు ఇన్‌ఛార్జ్ ఖర్చుపెట్టే మొత్తం, చేసే ఆర్భాటం వంటి అంశాలపై ఆయన అర్హత ఆధారపడి ఉంటుందని సంకేతాలు ఇస్తున్నారట. వేలమంది జనాలతో, హంగు ఆర్భాటాలతో చినబాబు యాత్ర విజయంతం చేస్తేనే వచ్చే ఎన్నికలలో ఆయనకు టిక్కెట్. ఇప్పటికే గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాక ఒక వైపు, జగన్ ప్రభుత్వం ఏర్పడిన రెండవ రోజు నుండే ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ పార్టీ చేపట్టిన ఉద్యమాలకు లక్షలకి లక్షలు తగలబెట్టుకుని మరోవైపు అల్లాడుతుంటే... ఇప్పుడు ఈ పాదయాత్ర బాధ ఏందిరా బాబూ... అని తెలుగు తమ్ముళ్ల తలలు పట్టుకుంటున్నారని అంటున్నారు. పాదయాత్రలో ఎక్కడైనా జనం తగ్గినా, ఆర్భాటానికి లోపం జరిగినా.. అదేరోజు రాత్రే బాబు, తనయులిద్దరూ సంబంధిత నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌కి క్లాసు పీకుతున్నారట. అంతేకాకుండా పక్క నియోజకవర్గ నేతను పిలిపించి వారి నియోజకవర్గంలో ఇలాంటి లోపం లేకుండా చూసుకోవాలని హెచ్చరిస్తున్నారని సమాచారం. చిత్తూరులో కూడా స్థానిక నాయకులకు తలంటుపోశారని వార్త. జగన్‌రెడ్డి సంగతి దేముడెరుగు, తమకి ఈ బాదుడేంది...? ఇదేం ఖర్మ..?? అంటూ వాళ్ళల్లో వాళ్ళే ఒకరిని ఒకరు ఓదార్చుకుంటున్నారని రాజకీయ విశ్లేషకుల సమాచారం. బాబు తమ నియోజకవర్గాలలోకి వస్తున్నాడంటేనే హడలి చస్తున్నామని తెలుగు నేతలు అంటున్నారని భోగట్టా! ఉద్యమాల పేరుతో, పాదయాత్రల సాకుతో ఉన్నదంతా ఊడ్చేస్తే రేపు ఎన్నికలొస్తే తమ గతేంకావాలని వాపోతున్నారని అంటున్నారు.

### 'యువగళం' ప్లస్సా..? మైనస్సా..??

లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర తమ పార్టీకి ప్లస్సా..? మైనస్సా..?? ఇది ఇప్పుడు పార్టీ వర్గాల్లో సర్వత్రా వినిపిస్తున్న ప్రశ్న. "జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉంది. రాబోయే ఎన్నికలలో గెలుపు మాదే. మళ్ళీ మా చంద్రబాబే ముఖ్యమంత్రి" అని గోబెల్స్ ప్రచారంచేసి, మైండ్‌గేమ్ ఆడుతుండిన టీడీపీ నేతలు ఇప్పుడు సందిగ్ధంలో పడ్డారని కూడా విశ్లేషకులు అంటున్నారు. వాస్తవం ఏదైనా మేకపోతు గాంభీర్యంతో ప్రజాక్షేత్రంలో తిరుగుతుండిన తమకు ఇప్పుడు లోకేష్ పాదయాత్రలో జనం కరువు కావడం పెద్ద మైనస్ అయ్యిందన్నది పార్టీవర్గాల అభిప్రాయంగా కూడా విశ్లేషకులు చెప్తున్నారు. తాము ప్రచారం చేసుకుంటున్నంత సీన్ లేదని, జనం జగన్ వైపే ఉన్నారన్నది ఈ పాదయాత్రతో స్పష్టమైపోతుందన్నది వారి భావన. లోకేష్ పాదయాత్ర మొదలై ఇప్పటికి 20 రోజులే అయ్యింది. ఇంకా 380 రోజులు ఉన్నాయి. అంటే ఏడాదికిపైగా నడవాలి. రాబోయే కాలం ఎండాకాలం కూడా. జనవరి, ఫిబ్రవరి మాసాలలోనే ఇలా ఉంటే.. ఇక మార్చి, ఏప్రిల్, మే మాసాలలో తమ పరిస్థితి ఎలా ఉండబోతోందో ఊహించుకుంటేనే భయమేస్తుందని నేతలు వాళ్ళల్లోవాళ్ళే కుమిలిపోతున్నారని అంటున్నారు.

యాత్ర పూర్తయ్యేలోగా ఎన్నికలు వచ్చినా రావొచ్చు, అప్పుడు కూడా పరిస్థితి ఇలాగే ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు నల్లేరు మీద నడకే అని తెలుగుదేశం పార్టీ శ్రేణులే చెప్పడం కొసమెరుపు..!

# ఏపీలో కొత్త రైల్వేజోన్ పనుల స్థితిగతులేమిటి?

## - పార్లమెంట్‌లో ప్రశ్నించిన విపిఆర్



ఆంధ్రప్రదేశ్‌లో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ (ఎస్‌సిఓఆర్) ఏర్పాటు కోసం కొత్త రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయడానికి ప్రకటన వెలువడేవరకు మంజూరైన ప్రతి పనికి సంబంధించిన వివరాలేమిటని, ప్రతి పని అంచనా వ్యయం, భూమి సర్వే స్థితి, సౌత్‌కోస్ట్ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం కోసం, ఆఫీస్ కాంప్లెక్స్ కోసం, లేఅవుట్ ప్లాన్, రెసిడెన్షియల్ కాలనీ వగైరాలకు సంబంధించిన వివరాలు తెలపాలని ఈనెల 10న పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. 2022-23లో కేటాయించిన రైల్వే బడ్జెట్‌లో ఖర్చుచేసిన మొత్తం మరియు ఏర్పాటైన కమిటీ పరిశీలిస్తున్న అధికార పరిధి సమస్యలు, వాటి యొక్క స్థితిని తెలుపమని ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, సౌత్ కోస్ట్ రైల్వేస్ జోన్ హెడ్ క్వార్టర్ ఏర్పాటు కోసం 106.89 కోట్ల అంచనా వ్యయంతో ఆ పని మంజూరైందని, సౌత్‌కోస్ట్ రైల్వే, జోనల్ హెడ్‌క్వార్టర్స్ నిర్మాణం కోసం ల్యాండ్ పాకెట్ ఆఫీస్ కాంప్లెక్స్ గుర్తించబడిందని చెప్పారు. 2022-23లో కేటాయించిన రైల్వే బడ్జెట్‌లో 7.29 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, అందుకు ఏర్పాటైన కమిటీ, అధికార పరిధి సమస్యలు పరిశీలించడానికి మరియు సమీక్షించడానికి రోలింగ్ స్టాక్ నిర్వహణ, మౌలిక సదుపాయాల సమర్థతను దృష్టిలో ఉంచుకుని, సరుకు రవాణా, ప్రయాణీకుల ట్రాఫిక్‌లను నిర్ధారిస్తూ ఆ కమిటీ తమ నివేదికను సమర్పించడం కూడా జరిగిందని వివరించారు.

# కొత్త డిఇఓగా గంగాభవాని



నెల్లూరు జిల్లా విద్యాశాఖ అధికారిణిగా ఆర్ఎస్ గంగాభవాని ఇటీవల నియమితులయ్యారు. ఏలూరులో డిఇఓగా పనిచేస్తున్న ఆమెను నెల్లూరుకు బదిలీచేస్తూ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వులిచ్చారు. ఇక్కడ డిఇఓగా పనిచేస్తున్న పి.రమేష్ ప్రకాశం జిల్లా డిఇఓగా బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన గంగాభవాని ఇటీవల జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబును మర్యాదపూర్వకంగా వారి క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## రెడ్డి & రెడ్డి వరదారెడ్డి సతీమణి

# హజరత్తమ్మ కన్నుమూత..!



'రెడ్డి & రెడ్డి' అధినేత దివంగత వరదారెడ్డి సతీమణి నాగులపాటి హజరత్తమ్మ తమ 85వ ఏట ఫిబ్రవరి 14వతేదీ, మంగళవారం నాడు హైదరాబాదులో కన్నుమూశారు. నెల్లూరులో వరదారెడ్డిని ఎరుగని పాతతరం కుటుంబమే ఉండదు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడిగా ఆయన బాగా ప్రసిద్ధి. పొగతోట అరుణ బుక్‌స్టాల్‌ని ఆనుకుని ఉండే రెడ్డి & రెడ్డి అంటే అప్పట్లో చాలా ప్రసిద్ధి. ఆ రోజుల్లోనే అత్యంత ఆధునికంగా తమ సంస్థ షోరూంని తీర్చిదిద్దిన ఆధునిక భావాలు కలిగిన వ్యక్తి వరదారెడ్డి. వరదారెడ్డి స్వగ్రామం గూడూరు ప్రాంతం చెన్నూరైనా, ఆయన నెల్లూరులోనే స్థిరపడిపోయారు. ఇక్కడ వ్యాపారాన్ని బాగా అభివృద్ధి చేసి ఆ తరువాత స్నేహితుల ప్రోద్భలంతో 1980వ దశకంలో హైదరాబాదుకి తన మకాం మార్చారు. అక్కడ ఎయిర్ కండిషన్ల తయారీదారుడిగా మంచిపేరు గడించారు. వరదారెడ్డి - హజరత్తమ్మ దంపతులకు కుమార్తెలు సరస్వతి, తనూజ, కుమారుడు రవి ఉన్నారు. గత కొంతకాలంగా అస్వస్థతతో ఉన్న హజరత్తమ్మ మంగళవారంనాడు తనువు చాలించారు. హజరత్తమ్మ ఆత్మశాంతికై ప్రార్థిస్తూ.. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# టీ వాకిట సీఎం ఆశావహుల కిటకిట..!

మిగిలిన విషయాల్లో ఎలా ఉన్నప్పటికీ ఒక్క విషయంలో మాత్రం ఆంధ్రప్రదేశే తెలంగాణ కంటే బెటరు అని అనుకోవాలి.. ముఖ్యమంత్రి పదవికి వైసీపీలోనూ, టీడీపీలోనూ పోటీలేదు. ఏదో అద్భుతం జరిగితే తప్ప (barring a miracle), ముఖ్యమంత్రి పదవికి ఏపీలో ఇద్దరే అభ్యర్థులు. అయితే, జగన్మోహన్‌రెడ్డి... కాకపోతే, చంద్రబాబునాయుడు.

కానీ, తెలంగాణలో మాత్రం ఈ పదవిపై మమకారం పెంచుకున్న ఆశావహులకు, పార్టీలకు కొరత కనపడడం లేదు... అలాగే, స్పష్టత కూడా కనపడడం లేదు. అందుకే, ఈసారి హంగే అనేవారు కూడా లేకపోలేదు. కోమటిరెడ్డి వేంకటరెడ్డి ఇప్పటికే శుభం పలికారు, ఏ పార్టీకి 60 సీట్లు రావు అని.

1. కేసీఆర్, లేదా... వారి కుమారుడు కేటీఆర్, 2. బండి సంజయ్, 3. డాక్టర్ కే.లక్ష్మణ్, 4. జీ.కిషన్‌రెడ్డి, 5. రేవంత్‌రెడ్డి, 6. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, 7. భట్టి విక్రమార్క, 8. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, 9. వై.ఎస్.షర్మిల....

ఇదో పెద్ద జాబితా. ఈ జాబితాలోని పేర్లన్నీ ముఖ్యమంత్రి పదవి ఆశావహులవే.. కాలం, జాతకం కలిసి వస్తే.

తెలంగాణలో ఉన్న శాసనసభ స్థానాల సంఖ్య 119. అంటే 60 స్థానాలు గెలిస్తే చాలు, ముఖ్యమంత్రి అయిపోవచ్చు. తెలంగాణను ఒక పట్టు పట్టేయవచ్చు. అందుకే, అందరి దృష్టి ముఖ్యమంత్రి పదవిపై ఉంది.

వైఎస్ జగన్.. తన సోదరి షర్మిళకు రాజకీయాన్ని రుచి చూపించారు. ఆయన జైలుకు పరిమితమై ఉండవలసి వచ్చిన రోజులలో, 'జగనన్న వదిలిన బాణం' నేను అంటూ ఆమె ఆంధ్రప్రదేశ్ అంతటా కాలినడకన కలియతిరిగారు. రాజకీయ మాటలు, హావభావాలు, కలివిడి తనం మొదలైనవన్నీ ఈ పాదయాత్రలో బాగా వంట బట్టించుకున్నారు. పరిచయాలు పెరిగాయి. అనుయాయులు ఏర్పడ్డారు. అన్ని విద్యల్లోకి... రాజకీయం ఎంత సులభమో తెలిసివచ్చింది. జనం ఎంత అమాయకులో... వారిని ఎలా బోల్తా కొట్టించవచ్చో కూడా ఆమెకు ప్రత్యక్షంగా అవగతం అయింది. వీటితో, ఆమెలో రాజకీయ ఆకాంక్షలు ఊపిరి పోసుకున్నాయి. దాంతో, గృహిణి కాస్తా రాజకీయ నాయకురాలైంది.

కానీ, జగనన్నకు లభించిన రాజకీయాధికారంలో తనకు వారసత్వ వాటా / భాగస్వామ్యం లేకుండా పోయింది. ఇది యాదృచ్ఛికంగా జరిగిందో, వ్యూహాత్మకంగా జరిగిందో తెలియదు కానీ, జరిగింది. మొత్తం మీద, ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో ఆమెకు సూదిమొన అంతటి జాగా కూడా లేకుండాపోయింది.

దాంతో, ఆమె దృష్టి రెండవ తెలుగు భాగమైన తెలంగాణపై పడింది. ఒక భాగానికి తన సోదరుడు ముఖ్యమంత్రి అయ్యారు కనుక, రెండో భాగానికి తానెందుకు సీఎం కాగూడదనే తీవ్ర పట్టుదలతో ఆమె తెలంగాణలో పాదం మోపారు.

ముఖ్యమంత్రి పదవే ఆమె లక్ష్యం కాబట్టి, సీఎం కేసీఆర్‌పై తీవ్ర, నిశిత, సూటి విమర్శలతో ఆమె రంగంలోకి దిగేశారు.

"ఇప్పుడు కాకపోతే, 2029లో ..." ధ్యేయంగా ఆమె తెలంగాణలో నడుస్తున్నారు. వచ్చే అయిదారేళ్ళు ఆమె నడుస్తూనే ఉన్నప్పటికీ ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. నడవడం అనేది ఆమెకు ఒక హాబీగా మారింది అని చెప్పుకోవచ్చు.

ఆమెకు రెండు స్థిరమైన ఓటు బ్యాంకులు స్వతఃసిద్ధంగా ఉన్నాయి.

ఆమె వై.ఎస్.ఆర్ కుమార్తె కనుక, రెడ్డి కులంలో ఆమెకు మంచి సానుకూలత ఉంటుందనే అంచనా ఉంది. తెలంగాణలో రెడ్డి సామాజికవర్గానిది సంఖ్యాపరంగా పెద్దపీట. ఆమె భర్త బ్రాహ్మణుడు అయినప్పటికీ, ఎన్నికల క్యాలిక్యూలేషన్‌లో అది కౌంట్ అవ్వడం లేదు.

ఇక, రెండో ఓటు బ్యాంకు క్రైస్తవం.

రాజశేఖరరెడ్డి గారి పరివారం మూడు, నాలుగు తరాలుగా క్రైస్తవంలో ఉంది. పులివెందులలో క్రైస్తవాన్ని పెంచి పోషించింది. షర్మిళ భర్త బ్రదర్ అనిల్ స్వయంగా మత ప్రచారకులు. రెండు రాష్ట్రాలలోనూ ఓటు ఉన్న ఇంటింటికీ తెలిసిన వివరాలు ఇవి.

ఈ రెండూ గాక, ముస్లిం అభిమాన ఓటు బ్యాంకు కూడా షర్మిళకు లేకపోలేదు. తన తండ్రిగారి హయాంలో ముస్లింలకు ఆయన కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్ తాలూకు కృతజ్ఞత, క్రెడిట్... ఆంధ్రలో జగన్ ఖాతాలోనూ, తెలంగాణలో షర్మిళ ఖాతాలోనూ పడుతున్నాయి.

ఇవి గాక, ఖమ్మం జిల్లాలో రాజకీయంగా తిమ్మిని బమ్మి చేయగల పొంగులేటి శ్రీనివాసరెడ్డి త్వరలోనే బంధుమిత్ర సపరివార సమేతంగా షర్మిళ పార్టీలో చేరే సూచనలు ఉన్నాయి. ఇవన్నీ కలిసి, షర్మిళను భవిష్యత్‌లో ఒక ముఖ్యనేతగా తెలంగాణలో జనం ముందు ఆవిష్కరించబోతున్నాయి. ఆమె సహకారం 2023 ఎన్నికలకు బీజేపీ తీసుకునే అవకాశం కూడా లేకపోలేదు.

నం 2:- రేవంత్‌రెడ్డి.

షర్మిళకు వలె, రేవంత్‌రెడ్డి లక్ష్యం కూడా తెలంగాణ ముఖ్యమంత్రి పదవే. తెలుగుదేశంలో చంద్రబాబునాయుడుకు తలలో నాలుకలా ఉంటూ... 'ఓటుకు నోటు' కేసులో క్రియాశీలకంగా ఇరుక్కుపోయారు. గుడ్డిగా వెళ్లి పోలీస్ ట్రాప్‌లో పడ్డారు. ఫలితంగా ఓ నెల చర్లపల్లి జైలులో గడపాల్సి వచ్చింది. టీడీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వరకూ దూసుకుంటూ వచ్చారు. కానీ, తన లక్ష్య సాధనకు తెలుగుదేశం పెద్దగా ఉపయోగపడదని ఆయనకు తొందర్లోనే అర్థం అయింది. తన 'పాయింట్ అఫ్ వ్యూ'ను చంద్రబాబుకు వినయంగా చెప్పడానికి గట్టిగానే ప్రయత్నించి, టీడీపీ లోంచి బయటపడ్డారు.

బీజేపీ, కాంగ్రెస్‌లో ఏది బెటరా అని బేరీజువేసి, కాంగ్రెస్‌కు ఉన్నంత బలహీనమైన నాయకత్వం దేశంలోనే మరొక పార్టీకి లేదని అంచనాకు వచ్చి, అందులో రేవంత్‌రెడ్డి చేరారు.

కాంగ్రెస్‌లో ముప్ఫయ్ మంది సీఎం పోస్ట్ అభ్యర్థులు. ఏ ఇద్దరికీ మాట కలవదు. తనవంటి డైనమిక్ లీడర్ నరుక్కురావడానికి ఇంతకంటే సూట్ అయిన రాజకీయ పార్టీ మరొకటి లభించడం కష్టం. హైకమాండ్ కూడా బలంగా లేదు.

రాష్ట్రంలో 'సీనియర్' నేతలు ఒక్కళ్ళా ఇద్దరా? వీ.హనుమంతరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆయన బ్రదర్ రాజగోపాల్ రెడ్డి, రేణుకాచౌదరి, రాజనరసింహ, జగ్గారెడ్డి, జానారెడ్డి, షబ్బీర్ అలీ, మధుయాష్కీ మల్లు రవి, భట్టి విక్రమార్క.....

అందరూ సూపర్‌స్టార్‌లే. ఏ ఇద్దరికీ పడదు అంటారు. అటువంటి వీరి మధ్యలో దూసుకెళ్లడం సులభమన్న రేవంత్ అంచనా నిజమైంది. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ ప్రస్థానం పాదయాత్ర దాకా వచ్చింది. కాంగ్రెస్‌పార్టీ తరఫున హామీలు ఇవ్వడం కూడా మొదలైంది. కాంగ్రెస్ గెలిస్తే... తానే సీఎం కాండిడేట్ అనే విషయంలో కార్యకర్తలలో ఎవరికీ అనుమానాలు రాకుండా రేవంత్ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రేవంత్‌ను చూస్తూ కక్కలేక... మింగలేక అన్నట్టుగా సీనియర్ల పరిస్థితి కనిపిస్తోంది, చూసేవారికి.






నం. 3. బండి సంజయ్

తెలంగాణలో కేసీఆర్‌ను అధికారం నుంచి దించి, బీజేపీని అధికారంలోకి తేవాలని బీజేపీ కేంద్రపెద్దలు వేసిన స్కెచ్‌కి అనుగుణంగా దొరికిన ఆణిముత్యం పేరు బండి సంజయ్. లోక్‌సభ గత ఎన్నికల్లో తెలంగాణలోని 17 నియోజకవర్గాల్లో గెలిచిన నలుగురు బీజేపీ అభ్యర్థులలో ఆయన ఒకరు.

ఆర్ఎస్ఎస్ నేపథ్యంతో పాటు, ఆయన నోటి పదును ఆయనకు పెట్టని కోట. అదనపు లాజిక్‌తో బండి సంజయ్‌కు పనిలేదు.

మొన్నీమధ్య కేసీఆర్ ఖమ్మంలో పెట్టిన బీఆర్ఎస్ పార్టీ సభకు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవత్‌సింగ్ మాన్, కేరళ ముఖ్యమంత్రి విజయన్, యూపీ పూర్వపు ముఖ్యమంత్రి అఖిలేష్ లాంటి వారు వస్తే, ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో వచ్చిన పైసలు పంచుకొని, పట్టుకుపోడానికి వాళ్లంతా వచ్చిన్రు అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. అదీ, ఆయన విమర్శల రేంజ్. అలాగే, తెలంగాణ సచివాలయం కొత్త భవనంపై ఉన్న డోమ్‌లను మేం రాగానే కూల్చేస్తాం అని ఘనంగా ప్రకటించారు. సుప్రీం కోర్ట్ భవనంపై కూడా బ్రహ్మాండమైన డోమ్ ఉంది. మరి, దాని గురించి చెప్పలేదు.

ఏదో ఓ రకంగా డైలీ వార్తల్లో ఉండాలే.. కేసీఆర్‌ను తిట్టాలే. ఢిల్లీ పెద్దల దృష్టిని ఆకర్షించాలే. ఇదీ బండి సంజయ్ రాజకీయం. అన్నట్టు, ఆయనా పాదయాత్రలు చేస్తున్నారు గానీ, వాయిదాల పద్ధతిలో చేస్తున్నారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు ఓ భారీ బహిరంగ సభ. ముగింపుకు తరువాత ఓ బహిరంగ సభ. కేంద్రం నుంచి నేతలు దిగేసి, కేసీఆర్‌ను తలో తిట్టు తిట్టేసి, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లిపోవడంతో, బీజేపీ నిత్యం వార్తల్లో ఉంటోంది.

119 సీట్లలో మెజారిటీకి అవసరమైన 60 స్థానాలలో అసలు బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేయడానికి 'తగిన' అభ్యర్థులు కూడా బీజేపీకి ఇంకా దొరకలేదు. వేరే పార్టీల నుంచి రెంట్‌కు తెచ్చుకోవాలి. అయినా, హడావుడికి లోటు లేదు.

ఒకవేళ, తెలంగాణలో బీజేపీ గెలిచింది అనుకున్నప్పటికీ, సంజయ్‌కే సీఎం పదవి అప్పగిస్తారనే గ్యారంటీ ఏమీ లేదు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కే.లక్ష్మణ్ ఉన్నారు. ఇద్దరూ రెండు బలమైన కులాలకు చెందినవారు. రాజకీయంగా స్టేచర్ ఉన్నవాళ్లు. రాజకీయాల్లో హుందాతనంతో వ్యవహరించే వారు... బీజేపీ అగ్ర నాయకత్వానికి అందుబాటులో ఉన్నారు.

4. ప్రవీణ్‌కుమార్, ఐపీఎస్

ఐపీఎస్ అధికారిగా అదనపు డీజీపీ హోదాలో ఉద్యోగం వదిలేసి, రాష్ట్రంలో బీఎస్పీ జండా మోస్తున్న ప్రవీణ్‌కుమార్‌కు సమాజంలో చాలా మంచిపేరు ఉంది. సమాజానికి ఏదో చేయాలనే తపన ఆయనలో ఉంది. రాష్ట్రంలోని గురుకులాల ద్వారా దళిత విద్యార్థుల ప్రతిభాపాటవాలను రాష్ట్ర, దేశ, ఖండాంతర సరిహద్దులు దాటించిన ఖ్యాతి ఆయనది.

ఆయన పట్ల సమాజంలోని అన్ని వర్గాలలోనూ సద్భావన, గౌరవం ఉన్నప్పటికీ, ఆయన రీచ్ మాత్రం కొన్ని వర్గాలకు పరిమితమైపోయింది. ఆయన కూడా పాదయాత్ర చేపట్టవచ్చు. చేపడితే... ఇదొక్కటే నిజాయతీతో కూడిన పాదయాత్ర అవుతుంది.

5. కాసాని జ్ఞానేశ్వర్ - తెలుగుదేశం.

తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి అధ్యక్షుడుగా ఇటీవలనే నియమితులైన కాసాని జ్ఞానేశ్వర్ ముఖ్యమంత్రి కాండిడేట్ అని చెప్పలేము కానీ, వచ్చే ఎన్నికల్లో ఖాళీగా మాత్రం కూర్చోరు. తెలంగాణలో బలమైన ముదిరాజ్ వర్గానికి చెందిన జ్ఞానేశ్వర్, తెలంగాణలో టీడీపీకి ఇప్పుడు ఓ ఆలంబన. రాష్ట్ర వ్యాప్తంగా 'స్లీపర్ సెల్స్' లాగా ఉన్న తెలుగుదేశం అభిమానులు, శ్రేయోభిలాషులు వచ్చే ఎన్నికల్లో ఒక 'లైన్' తీసుకునేలా కాసాని జ్ఞానేశ్వర్ యాక్టివేట్ చేస్తారనే భావం టీడీపీ వర్గాల్లో ఉంది. 'తగిన సమయం' వచ్చేవరకు, వేచివుండే మోడ్‌లో ఇప్పుడు తెలంగాణ టీడీపీ ఉంది. టీడీపీ వల్ల ఏ పార్టీకి లాభమో ఇప్పుడే అంచనా వేయడం కష్టం.

వీరుగాక, తెలంగాణ ఉద్యమ సమయంలో అన్నీ తానే అయి వ్యవహరించిన కోదండరాం, ఇతరులు ఉన్నారు.

ఇంతమందీ విడివిడిగా పోరాటాలు, పాదయాత్రలూ చేస్తున్నది... తన కుర్చీ కోసమేనని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలుసు.

'ప్రత్యేక తెలంగాణ' అనే ఒక 'ట్రెజర్' ఎక్కడో ఉందని ముందుగా అంచనా వేసిన నేత కేసీఆర్. ఓర్పుగా, నేర్పుగా, వ్యూహాత్మకంగా కాంగ్రెస్, బీజేపీని ముందుపెట్టి ఆ 'ట్రెజర్ హంట్' చేసి, ఆ రెండు పార్టీలను బయటకు పంపించి... 'ట్రెజర్'ను చేజిక్కించుకున్న నేత, కేసీఆర్.

'తెలంగాణను మేము తెచ్చాం' అని కనీసం చెప్పుకోడానికి కూడా బీజేపీ, కాంగ్రెస్‌కు అవకాశం లేకుండా చేయడమేగాక, వాటికి తెలంగాణలో నిలువ నీడ కూడా లేకుండా చేసిన నేత కేసీఆర్.

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులు పనిచేసి ఉన్న క్యాంపు ఆఫీస్‌ను కూలగొట్టి, 'తెలంగాణ సీఎం క్యాంపు కార్యాలయం'గా ప్రగతి భవన్ పేరిట ఒక రాజప్రాసాదాన్ని వేడుకగా, కన్నుల పండువగా నిర్మించుకున్న నేత కేసీఆర్. అదే రీతిలో 'వలస పాలకులు' కూర్చున్న సచివాలయ భవనాలను నామరూపాలు లేకుండా నేలమట్టం చేయించి, మొఘల్ సామ్రాజ్యాన్ని తలపింపచేసే సచివాలయాన్ని నిర్మింపచేసి, అందులోనుంచి తెలంగాణను పాలించాలనే తలకలను సాకారం చేసుకోబోతున్న నేత కేసీఆర్.

తెలంగాణ రాజకీయ, సాంస్కృతిక, సామాజిక, పాలనా సంస్థ.... కేసీఆర్‌తోనే ప్రారంభం అయిందా అంటూ మరో రెండు, మూడు తరాల తరువాతి వారు ఆశ్చర్యపోయేలా ఒక పథకం ప్రకారం అడుగులు వేస్తున్న నేత కేసీఆర్.

ఆయన ఒళ్లంతా రాజకీయం. మనసంతా రాజకీయం. నరనరానా రాజకీయం. చూపుల్లో, చేతల్లో, మాటల్లో రాజకీయం ఒలికిపోతుంటుంది.

'2014 నాటి కేసీఆర్' అనుకుని రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఆయనతో వ్యవహరిస్తున్నాయి. అవాకులు, చవాకులు పేలుతున్నాయి. కానీ, ఆయన '2024 లోక్‌సభ ఎన్నికల మైండ్‌సెట్'తో 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆఖరిరోజు సమావేశాల్లో ఆయన బీజేపీకి చెందిన ఈటల రాజేంద్ర పేరును సానుకూల దృక్పథంతో పదేపదే పదిసార్లకు పైబడి ప్రస్తావించిన తీరును బట్టే... కేసీఆర్‌లోని రాజకీయవేత్తను అంచనా వేసుకోవచ్చు.

కేసీఆర్‌ను ఓడించి, ప్రగతి భవన్‌లో కుడికాలు పెట్టాలనుకునే ప్రతిపక్ష నేతలు... ఎవరి పాదయాత్రలు వారు చేసుకుంటూ... ఎవరి ఆత్మానందం వారు పొందవచ్చు గానీ, వారంతా కలిసి... కేసిఆర్ వ్యతిరేక ఓటును చీలికలు పీలికలుగా చీల్చేస్తున్నారు. వారు కేసిఆర్‌కు చేసే సాయం ఇంతకంటే ఎక్కువ ఏముంటుంది? వారంతా ఆయనకు 'వ్యతిరేక' మిత్రులే!

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# శ్రద్ధాంజలి



16.02.1933 - 23.02.2021

ఆదర్శమూర్తి, ఆత్మీయదీప్తి, మా కుటుంబ కీర్తి

## కీ॥శే॥ గునుపాటి హరిశ్చంద్రారెడ్డి గారు

పరమపదించి ఫిబ్రవరి 23, 2023 నాటికి రెండేళ్ళు గడవనున్నాయి.
వారి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం.

గునుపాటి శ్యామల - భార్య
గునుపాటి పార్వతి - కుమార్తె
గునుపాటి వెంకటేశ్వరప్రసాద్ - కుమారుడు
గునుపాటి అనూరాధ - కోడలు

మనుమళ్ళు, మనుమరాళ్ళు

దామోదర్ - ఇందిర - సంజన - మల్లిక - శరత్

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com